



భానుడి దెబ్బకు విలవిల్లాడిన ప్రజలకు వరుణుడు గురువారం సాయంత్రం చిరుజల్లులతో ఉపశమనమిచ్చాడు..

తలకెక్కించుకోకపోతే ఫైన్!



హెల్మెట్ లేకుండా తిరుగుతున్నారా! అయితే మీరు ఫైన్ కట్టాల్సిందే.. వందో రెండొందలో కాదండోయ్.. ఏకంగా రూ.1035.. తొలిసారి అయితే ఫైన్.. రెండో సారి దొరికారో బైక్ సీజ్.. కేసు నమోదు.. గతంలో కూడా ఇలాగే చెప్పారులే అని కామెడీగా తీసుకుని బైక్ ఎక్కి బయటకు వచ్చారో పోలీసులు సీరియస్ గా పట్టుకుని ఫైన్ వేస్తారు జాగ్రత్త! ఇదంతా తలకెక్కించుకుని.. హెల్మెట్ పెట్టుకోండి మరి..

- హెల్మెట్ తప్పనిసరి
- లేదంటే జరిమానా
- తొలిసారి రూ.1035
- ముమ్మర తనిఖీలు

హెల్మెట్ పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యంపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు.కొన్నాళ్లుగా హెల్మెట్ లేకుండా పట్టుబడినా కౌన్సెలింగ్ చేసి పంపేవారు. కానీ పరిస్థితిలో మార్పు కానరాక పోవడంతో తనిఖీలు ముమ్మరం చేసి జరిమానా విధిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషను పరిధిలో ప్రతి రోజూ హెల్మెట్ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ కేసులు రాస్తున్నారు. పట్టుబడితే రూ.1035 జరిమానా విధిస్తున్నారు. రాజమహేంద్రవరంలోని చాలా చోట్ల ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తనిఖీలు చేస్తున్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడి పితే ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తున్నారు. మొదటిసారి జరిమానా విధిస్తారు.. రెండో సారి హెల్మెట్ లేకుండా పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేసి కేసు కూడా పెడుతున్నారు.

6 నెలలు.. రూ.32.52 లక్షలు ఫైన్

జిల్లాలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడంపై ఈ ఏడాది ఆరు నెలల్లో 14,922 కేసులు పెట్టి రూ.32.52 లక్షల జరిమానాలు విధించారు. వీటిలో 3350 కేసుల్లో రూ.5.54 లక్షలు మాత్రమే వసూలయ్యాయి.

మిగతా చలానాలు పెండింగ్‌లో ఉన్నాయి. హెల్మెట్ లేకుండా ఒకటి కంటే ఎక్కువసార్లు పట్టుబడితే కేసు పెట్టి కోర్టుకు పంపిస్తారు.

హెల్మెట్ లేక.. 124 మంది మృతి

ఈ ఏడాది ఆరు నెలల్లో మొత్తం 304 ద్విచక్ర వాహన ప్రమాదాలు జరగ్గా.. 114 ప్రమాదాల్లో 124 మంది మరణించారు. 190 ప్రమాదాల్లో 295 మందికి తీవ్రమైన గాయాలయ్యాయి. 304 ప్రమాదాల్లో 80 శాతం మంది తీవ్రగాయాలు లేదంటే ప్రాణాలు కోల్పోయారు.



హెల్మెట్ ధరించాల్సిందే : ఎస్పీ నరసింహ కిశోర్

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందే. నగరాలు/పట్టణాల్లో లేదా పలానా చోట్ల హెల్మెట్ అవసరం లేదనే వదంతులు సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నారు. వాటిని నమ్మొద్దు. అలాంటి పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం.



ఢిల్లీలో గురువారం కేంద్ర మంత్రి నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు అందుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

ఆహో..అద్వితీయం!

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 19వ ర్యాంక్ సాధించిన రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో ఈ సారి రాజమహేంద్రవరం కార్పొరేషన్ జాతీయస్థాయిలో 19వ ర్యాంక్ కైవసం చేసుకుని అత్యుత్తమ ఘనత సాధించింది.స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 ర్యాంక్‌లను గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రస్థాయిలో చూస్తే రాజమహేంద్రవరం రెండో స్థానంలో ఉంది. ప్రజల సహకారం, పారిశుధ్య సిబ్బంది కృషి ఫలితంగా రాజమహేంద్రవరం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 2020లో 51వ ర్యాంక్ , 2021లో 41వ ర్యాంక్, 2022లో 97వ ర్యాంక్, 2023లో 59వ ర్యాంక్, 2024-25లో 19వ ర్యాంక్ సాధించింది.గతంలో పోల్చితే ఈ సారి వచ్చిన ర్యాంక్ అత్యుత్తమమైనది. ఈ మేరకు ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అవార్డు అందుకున్నారు. పరిశుభ్రత కోసం తీసుకున్న వినూత్న చర్యల వల్ల క్లీన్ రాజమహేంద్రవరం సాధ్యమైందని కలెక్టర్ అన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాజమహేంద్రవరానికి 19వ ర్యాంక్ రావడం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. కలెక్టర్ వెంట ప్రభుత్వ ఎంయూడీసీ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్,సీడీఎంఏ కమిషనర్ సంపత్‌కుమార్, కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్, ఎంహెచ్‌వో వినూత్న,సీవోసీ ఇన్‌చార్జి రవితేజ ఉన్నారు.



అమృత్ పథకంలో ఆరు స్టేషన్ల అభివృద్ధి

బడ్జెట్ కేటాయింపుపై రైల్వే నోట్

రాజమహేంద్రవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రైల్వే శాఖ బడ్జెట్‌లో రాష్ట్రానికి 2025-26కు సంబంధించి కేటాయింపులపై గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. దానిలోనూ రాజమహేంద్రవరానికి సంబంధించి పాత కూతే వినిపించింది. స్టేషను రీడెవలప్‌మెంట్‌కి రూ.271.43 కోట్లు కేటాయించామని పేర్కొంది. రెండేళ్లలో రానున్న పుష్కరాల నాటికి పనులు పూర్తి కావాలని ప్రజాప్రతినిధులు పదే పదే విన్నవిస్తున్నా పనులు ఇంకా టెండరు ప్రిపరేషన్ దశలోనే ఉన్నాయని ఆ ప్రకటనలో పేర్కొనడం గమనార్హం. అంటే ఇంకా టెండరు కూడా పిలవలేదు. ఆ ప్రక్రియ పూర్తి కావడానికి ఇంకా ఎన్నాళ్లు పడుతుందో స్పష్టత లేదు.రైల్వే రీడవలప్‌మెంట్ పనులకు నిధులిచ్చినా పనులు మొదలు పెట్టడంలో కాలయాపనపై ఇటీవలే 'ఆంధ్రజ్యోతి' కథనం వెలువరించడం తెలిసిందే. మరో వైపు అనపర్తి, నిడదవోలు జంక్షన్, రాజమహేంద్రవరం, కాకినాడ టౌన్, సామర్లకోట,తుని రైల్వే స్టేషన్లను అమృత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్నారు.



ఎత్తిపోస్తారు!

ప్రైవేటుకు ఎత్తిపోతల

- ఉమ్మడి జిల్లాలో 28 పథకాలు
- కార్పొరేట్‌కు నిర్వహణ బాధ్యత
- రూ.600 కోట్లతో ప్రతిపాదన
- వైసీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం
- ఏజెన్సీలో 50 పథకాల మూత
- కూటమి ప్రభుత్వం దృష్టి
- కొత్త పద్ధతికి శ్రీకారం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

నిర్వీర్యమైన చిన్న నీటిపారుదల వ్యవస్థను బతికించడానికి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ఆరంభించింది. ఓ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థకు మరమ్మతులు, నిర్వహణ బాధ్యత అప్పగించనుంది. ఉభయగోదావరి జిల్లాల్లో మెట్ట ప్రాంతంలోని 48 ఎత్తిపోతల పథకాల మరమ్మతులు, నిర్వహణకు రూ.600 కోట్లతో అధికారులు అంచనాలు సిద్ధంచేశారు. గత వైసీపీ హయాంలో చిన్న నీటిపారుదల వ్యవస్థ పూర్తిగా అవస్థలకు గురైంది. ఇప్పటికే ఏజెన్సీలో 70 ఎత్తిపోతల పథకాలు మూతపడ్డాయి. దీంతో వాటిని వదిలేశారు. కాలువల ద్వారా నీటి సరఫరా లేని మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో సాగునీరు సరఫరా చేయడానికి 1974లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల సంస్థ ఏర్పడింది. కనీసం 50 నుంచి 5 వేల ఎకరాల వరకూ ఉన్న భూములకు ప్రభుత్వం ఒక్కొక్క ఎత్తిపోతల పథకం నిర్మించి రైతులకు అప్పగించేది. వాటికి ఉచిత కరెంట్ ఇచ్చేది. వాటి నిర్వహణ రైతులు చేసుకోవాలి. దీని కోసం 11 మంది సభ్యులతో కూడిన రైతు కమిటీ ఉండేది. రైతుల నుంచి ఎకరాకు రూ.500 నుంచి రూ.1000 వరకూ ఏడాదికి వసూలు చేసి ఎత్తిపోతల పథకాలు నిర్వహణ చూసేవారు. ఇలా చాలా కాలం నడిచిన పథకాలను వైసీపీ పూర్తిగా నిర్వీర్యం చేసింది. దీంతో చాలాచోట్ల రైతులు వదిలేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 101 ఎత్తిపోతల పథకాలు ఉండేవి. 37,450 ఎకరాల ఆయకట్టు ఉండేది. పోలవరం ప్రాజెక్టు ముంపు కారణంగా ఏజెన్సీ ప్రాంతాల్లో 50 ఎత్తిపోతల పథకాలను పనిచేయడంలేదు. మరో 20 పథకాలు నిర్వీర్యమయ్యాయి. ప్రస్తుతం ఉభయగోదావరి జిల్లాల పరిధిలో ఉన్న 48 ఎత్తిపోతల పథకాలను రైతుల నుంచి తప్పించి కార్పొరేట్ సంస్థకు ఇచ్చి వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 28 పథకాలు..

- తూర్పుగోదావరి జిల్లాలో 10 పథకాలు పాక్షికంగా పనిచేస్తున్నాయి. కొవ్వూరు నియోజకవర్గంలో కుమారదేవం, బ్రాహ్మణగూడెం, చాగల్లు, వేగేశ్వరపురం, పైడిమెట్ట-1, నిడదవోలు, అనపర్తిలో పి.బి.దేవం-1,2, కాపవరం,సీతానగరం మండలం కాటవరం ఉన్నాయి.23,745 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు,నిర్వహణకు రూ.195 కోట్ల 60 లక్షలతో అంచనాలు పంపించారు.
- అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4 పథకాలున్నాయి. రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో చింతలమోరి, వసంతవాడ ఉన్నాయి. మొత్తం 4,970 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు, నిర్వహణకు రూ.34 కోట్ల 8 లక్షల 37వేలతో అంచనాలు సిద్ధంచేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పల్లిపాలెం-1,2 పథ కాలున్నాయి. 927 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు, నిర్వహణకు రూ.3.48 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు.
- కాకినాడ జిల్లాలో 14 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. పెద్దాపురం నియోజకవర్గంలోని వేట్లపాలెం, కట్టమూరు, కట్టమూరుమినీ, పెద్దాపురం-1,2, జి.మేడపాడు, పెదబ్రహ్మదేవం-3, కాకినాడ రూరల్‌లో వేములవాడ-2, పెద్దాపురపాడు, గొర్రిపూడి, వేములవాడ- అనపర్తి నియోజకవర్గం పరిధి పెదపూడి, దోమాడ, జగ్గంపేట నియోజకవర్గంలో సోమవరం పథకాలున్నాయి. 13,710 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు, నిర్వహణకు రూ.122కోట్ల 25లక్షల 32వేలు అంచనా వేశారు.



కట్టమూరు ఎత్తిపోతల పథకం



తగ్గిన గోదారి

7

బౌద్ధ క్షేత్రంగా పాండవుల కొండ

పరిశీలించిన ఎంపీ పురందేశ్వరి

కోరుకొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బౌద్ధక్షేత్రం పాండవుల కొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు.తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కాపవరంలో ఉన్న పాండవుల కొండను గురువారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, అధికారులతో కలిసి సందర్శించారు. బౌద్ధ వారసత్వ ప్రదేశమైన ఈ పాండవుల కొండ పరిరక్షణ ఎంతో అవసరం అన్నారు. కొండపైన గత రాతి గుహలు, స్తూపాలు, ఆరామాలు జాతీయ ప్రాముఖ్యత కలిగిన కేంద్ర రక్షిత స్మారక చిహ్నంగా ఉందన్నారు. విజయవాడలోని కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఈ కొండను జాతీయ స్మారక చిహ్నంగా ఏనాడో గుర్తించారన్నారు. ప్రస్తుతం ఈ కొండ శిథిలావస్థలో ఉందని దీనికి తక్షణ పరిరక్షణ అవసరం అన్నారు. పాండవుల కొండను బౌద్ధ క్షేత్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఆమె వెంట బీజేపీ నాయకులు ఏపీఆర్ చౌదరి, అడపా సుధీర్‌కుమార్, టీడీపీ నాయకులు కంటే నాగ కేశవ రావు, జనసేన నాయకులు తెలగంశెట్టి శివ, బదిరెడ్డి దొర, కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పాండవుల కొండ వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల, బీవీఆర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

గంజాయి కేసుల్లో వేగం పెంచండి : ఎస్పీ

రాజమహేంద్రవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశించారు. గంజాయి కేసులపై గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న నిందితులను అరెస్టు చేయాలని, న్యాయశాఖ సహాయం తీసుకొని చార్జిషీట్లను త్వరితగతిన దాఖలు చేయాలని ఆదేశించారు. ఎన్‌బీడబ్ల్యుల అమలుకు ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. కోర్టు విచారణలో ఉన్న కేసుల్లో సాక్షులు, నిందితులు క్రమం తప్పకుండా హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి కట్టడి దిశగా నిఘా ముమ్మరం చేయాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, రద్దీ ప్రదేశాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ(అడ్మిన్), అర్జున్(క్రైమ్స్) తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల వ్యవ'సాయం'


రైతులకు 80 శాతం రాయితీతో అందిస్తున్న డ్రోన్లు



- రైతులకు 80 శాతం రాయితీపై డ్రోన్లు
- సేద్యపు వ్యయంలో ఊరట
- కూలీల కొరతకూ పరిష్కారం
- జిల్లాల యూనిట్‌గా కేటాయింపులు
- సాగులో యాంత్రీకరణ దిశగా ప్రోత్సాహం
- సేద్యంలో కష్టాలను అధిగమించనున్న రైతులు

(ముమ్మిడివరం-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ సేద్యంలో డ్రోన్లు అందుబాటులోకి రావడంతో రైతులకు సాగులో ప్రోత్సాహం లభించనుంది. కూలీల కొరత.. రోజురోజుకు సేద్యపు వ్యయం పెరగడంతో రైతులు వరిసాగులో గిట్టుబాటు కరువవుతోంది. పురుగుమందుల పిచికారీ, నాట్లు వేయడానికి, కోతలకు సకాలంలో కూలీలు లభించకపోవడంతో రైతులకు సేద్యపు కష్టాలు పెరిగిపోతున్నాయి. వీటిని అధిగమించేందుకు వ్యవసాయశాఖ యాంత్రీకీకరణను ప్రోత్సహిస్తోంది. గతంలో టీడీపీ హయాంలో రాయితీపై యంత్ర పరికరాలను అందించేవారు. ఇవికాక ప్రైవేటు భాగస్వామ్యంతో కస్టమ్ హైరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీ) ఏర్పాటుచేసి రైతులకు అద్దె ప్రాతిపదికన యంత్రాలు అందించేవారు. 2018లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా నిర్ణయించగా కేవలం ఆరుచోట్ల మాత్రమే ఏర్పాటుచేసినా ప్రభుత్వం నుంచి రాయితీ సకాలంలో అందక వాటి నిర్వహణ కష్టం కావడంతో వాటిని మూసివేశారు. వైసీపీ పాలనలో రాయితీపై యంత్రాల సరఫరా పథకం అమలుచేసిన దాఖలాలే లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను యాంత్రీకీకరణ వైపు ప్రోత్సహించేందుకు తాజాగా రైతు గ్రూపులకు పురుగుమందులు నానో (ద్రవరూప ఎరువులు) పిచికారీ చేసేందుకు 80 శాతం రాయితీపై డ్రోన్లను సరఫరా పెద్దఎత్తున చేపట్టింది.

యూనిట్ ధర ఎంతంటే...

డ్రోన్ యూనిట్ ధర రూ.9 లక్షల 80 వేలు కాగా 80 శాతం ప్రభుత్వ రాయితీపై అందిస్తున్నారు. గతంలో రూ.4 లక్షల 90వేలు బ్యాంకు రుణం ఇస్తుండగా రూ.4 లక్షల 90వేలు ముందుగా కట్టాల్సి ఉండేది. అనంతరం ప్రభుత్వ రాయితీ రూ.7లక్షల 84వేలు తిరిగి బ్యాంకులో రైతు ఖాతాకు జమయ్యేది. రైతులు అంత మొత్తం కట్టలేకపోవడంతో కొంత వెసులుబాటు కల్పించారు. రైతులు రూ.2 లక్షలు ముందుగా బ్యాంకులో చెల్లిస్తే రూ.7లక్షల 84వేలు రాయితీని ప్రభుత్వం 15 రోజుల వ్యవధిలో బ్యాంకులోని రైతు ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తోంది.

అర్హతలు ఏంటంటే..

అన్ని సామాజిక వర్గాలను కలుపుకుని ఐదుగురు సభ్యులతో కిసాన్ డ్రోన్ రైతు మిత్ర గ్రూపు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గ్రూపులో కన్వీనర్, కోకన్వీనర్, మరో ముగ్గురు సభ్యులు ఉండగా, కన్వీనర్, కోకన్వీనర్‌లు కనీస విద్యావంతులై ఉండాలి. రైతులు ఒక గ్రూపుగా ఏర్పాటైన తర్వాత బ్యాంకులో ఆధార్, పాన్‌కార్డు, ఫోన్ నెంబరు లింకేజీ బ్యాంకుకు అందించి సిబిల్ రేటింగ్ అర్హత పొందాలి. బ్యాంకు అనుమతి పొందిన వారికే డ్రోన్ మంజూరవుతుంది. గ్రూపుగా ఏర్పాటైన రైతులు తప్పనిసరిగా సొంత భూమి కలిగి ఉండాలి. డ్రోన్ ఆపరేటింగ్‌కు సంబంధించి రైతు మిత్ర కేసుల్లో సభ్యులుగానీ లేదా ఆ గ్రూపు వారు గ్రామంలో ఎవరినైనా ఎంపిక చేసిన వ్యక్తి కనీసం పదో తరగతి లేదా ఐటీఐ వంటి విద్యార్హత కలిగి ఉండాలి. డ్రోన్ నిర్వహణ, ఆపరేటింగ్ విషయాలపై 12రోజులపాటు ఆ వ్యక్తికి ఉచితంగా శిక్షణ ఇస్తారు. గుంటూరు, తాడేపల్లి, ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ సెంటర్లు ఉన్నాయి.

డ్రోన్ అద్దెకు కూడా..



డ్రోన్ పది లీటర్ల సామర్థ్యం కలిగి ఉంటుంది. పురుగుమందు ద్రావణాన్నిగానీ, నానో ఎరువులు ద్రవరూప ఎరువును గానీ పిచికారీ చేసుకోవచ్చు. ఎకరానికి డ్రోన్‌తో పిచికారీ చేయడానికి 4 నుంచి 5 నిమిషాల సమయం పడుతుంది. రైతుమిత్ర గ్రూపులు వారి సొంత పొలాలతోపాటు ఇతరులకు కూడా కొంత రేటు నిర్ణయించి అద్దెకు వాటిని సరఫరా చేయవచ్చు. ఈ డ్రోన్ బ్యాటరీపై నడుస్తుంది. బ్యాటరీలను చార్జింగ్ చేసుకునే అవకాశం ఉంది. ఇతరులకు పురుగుమందు పిచికారీకి అద్దెకు ఇచ్చేటప్పుడు ఎకరానికి రూ. 400 నుంచి రూ.500 వరకు వసూలు చేసుకోవచ్చు. డ్రోన్ వినియోగం వల్ల రైతుకు సమయం ఆదా అవ్వడంతోపాటు కూలీల కొరత ఇబ్బంది ఉండదు. కోనసీమ కూలీల కొరత రైతులను వెంటాడడంతో వరిసేద్యంలో యంత్రాల వినియోగం వైపు దృష్టి సారిస్తున్నారు.

కోనసీమ జిల్లాలో 40 డ్రోన్లు

డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 40 డ్రోన్లు మంజూరుకాగా, ఇప్పటివరకు 13 మండలాల్లో 20 రైతు మిత్ర గ్రూపులకు అందించగా మరో నాలుగు గ్రూపులకు డ్రోన్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఎనిమిది గ్రూపులకు సంబంధించి బ్యాంకు సిబిల్ రేటింగ్ లేక ఆయా గ్రూపులకు అర్హత కోల్పోయాయి. మరో ఎనిమిది గ్రూపులు డ్రోన్లు తీసుకునేందుకు అంతగా ఆసక్తి చూపలేనట్టు జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తెలిపారు. అర్హత ఉన్న గ్రూపులు డ్రోన్లు తీసుకోవడానికి ముందుకొస్తే ఇవ్వడానికి వ్యవసాయశాఖ సిద్ధంగా ఉందన్నారు.

వానొచ్చింది!


అమలాపురంలో..


రాజమహేంద్రవరంలో..

ఆషాఢం ఎండలు దంచి కొడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోహిణీ కార్తె మాదిరిగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు గత కొన్నిరోజులుగా ఎండ వేడిమికి తల్లడిల్లుతున్నారు. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. అమలాపురం, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో చిరుజల్లులతో ప్రారంభమై ఒక్కసారిగా వాన దంచికొట్టింది. ఆకాశంలో మేఘాలు అలా తొలగిపోగానే మళ్లీ భానుడు కొన్నిచోట్ల తన ప్రతాపాన్ని చూపించాడు. దాంతో ఒక్కసారిగా గుబులు రేగి జనం మళ్లీ చెమటలతో తడిసి ముద్దయ్యారు. రాజమహేంద్రవరం పరిసరాల్లో మాత్రం చల్లదనంతో జనం ఊపిరిపీల్చుకున్నారు.

- అమలాపురం రూరల్/ రాజమహేంద్రవరం



అలూమ్ని ఆడిటోరియంలో జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, జేఎన్టీయూకే అధికారులు

ప్రముఖుల పరిశోధనలు సమాజానికి ఎంతో దోహదం

- ఎన్‌బీఏ, న్యాక్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్దే
- రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై జేఎన్టీయూకేలో వర్క్‌షాప్

జేఎన్టీయూకే, జూలై 17 (ఆంధ్రజ్యోతి): యూసీఈకే ఓక్ ఉత్సవాల సందర్భంగా జేఎన్టీయూకేలోని అలూమ్ని ఆడిటోరియంలో 'రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ- 2020 ఇన్ స్వర్ణాంధ్ర వికసిత్ భారత్-2047' అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్‌ఆర్కే ప్రసాద్ గురువారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. నలుగురు ముఖ్య ఉపన్యాసకులు పాల్గొనగా... మొదటిగా ఎన్‌బీఏ, న్యాక్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్దే ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ భారతదేశంలో పూర్వకాలంలో నిర్వహించిన తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాల సంస్కృతిని కొనియాడారు. వర్గీస్ కురియన్, స్వామినాథన్, ఎఫ్‌సీ కోహ్లీ మొదలైన ప్రముఖుల పరిశోధనలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడ్డాయని వివరించారు. భారతదేశంలో పరిశోధనలకు ఐదు శాతం మాత్రమే నిధులు మంజూరవుతున్నాయని, దీనివల్ల పరిశోధనలు కుంటుపడుతున్నాయన్నారు. 2047కల్లా అందరికీ ఆహారం, నీరు, వసతి, ఉపాధి, అంతర్జాలం, విద్య, నైపుణ్యాలు, విద్యుత్, సుపరిపాలన ప్రజలకు పుష్కలంగా అందేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అనంతరం న్యూఢిల్లీకి చెందిన సౌత్ ఏషియన్ యూనివర్శిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకే అగర్వాల్ మాట్లాడుతూ నూతన విద్యా విధానం-2020 పట్టభద్రులను అందించడమే కాకుండా సమాజానికి పరిపూర్ణమైన వ్యక్తులను అందించే విధంగా రూపొందించబడిందన్నారు. పరీక్షల సమయాన్ని 3 నుంచి 2 గంటలకు కుదిస్తే విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావడం తేలిక అవుతుందన్నారు. యూజీసీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వేద్‌ప్రకాష్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యను తప్పనిసరి చేయాలని, ఉన్నత విద్యలో ప్రతిభకు పట్టం కట్టాలన్నారు. సుందర్ పిచాయ్ ఐఐటీలో కాకుండా చిన్న కళాశాలలో చదివారన్నారు. అమెరికా జీడీపీలో పరిశోధనలకు 3.9 శాతం కేటాయిస్తారని, మన దేశంలో 0.65 శాతానికే పరిమితమైపోయిందన్నారు. ఆన్‌లైన్, దూర విద్యకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. పూర్వ విద్యార్థి, చెన్నయ్ ఐఐటీ సీఎస్‌ఈ ప్రొఫెసర్ డి.జానకిరాం మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు ఎక్కువ ఒత్తిడికి గురవుతున్నారన్నారు. కళలు, క్రీడలు, పుస్తకపఠనంపై ఆసక్తి కలిగించి ఒత్తిడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రోల్ ఆఫ్ ఇండస్ట్రియలిస్ట్ టు కొలాబరేటివ్ విత్ అకడమిక్ ఇనిస్టిట్యూషన్స్ టు రియలైజ్ ఆబ్జెక్టివ్స్ ఆఫ్ స్వర్ణాంధ్ర వికసిత్ భారత్ 2047పై ప్యానల్ చర్చ నిర్వహించారు. దీనికి వర్శిటీ పూర్వ విద్యార్థి పీవీ రావు అధ్యక్షత వహించగా డాక్టర్ సరోజ అగర్వాల్, డాక్టర్ సిమ్లా, వీటీ చంద్రశేఖర్, దాసరి రామకృష్ణ, కేవీఆర్‌ఎస్ మూర్తి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ ఎంఎం పళ్లంరాజులను సత్కరించారు. వర్క్‌షాప్‌లో రెక్టార్ వీవీ సుబ్బారావు, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ఓఎస్డీ కోటేశ్వరరావు, ఓక్ ఉత్సవ కమిటీ చైర్మన్ పి.ఉదయభాస్కర్, వైస్ చైర్మన్ శ్రీనివాసకుమార్, పలువురు డైరెక్టర్లు, యూసీఈకే ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజును సత్కరిస్తున్న ఉప కులపతి ప్రసాద్, అతిథులు





గురువారం సాయంత్రం జేఎన్టీయూకే అనుబంధ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు


సీఎం చంద్రబాబు సమక్షంలో కేంద్ర సహాయ మంత్రిని కలిసిన కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

'కాకినాడలో క్రీడల అభివృద్ధికి సహకరించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పార్లమెంటరీ పరిధిలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా క్రీడలను అభివృద్ధి చేసేందుకు 'ఖేలో ఇండియా' కింద మౌలిక వసతులు కల్పించాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌లతో కలిసి కేంద్ర క్రీడల శాఖ సహాయ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను ప్రత్యేకంగా కలిసారు. ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. వచ్చే ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో మార్షల్ ఆర్ట్స్ గేమ్స్ నిర్వహించే అవకాశం కల్పించినందుకు కేంద్ర సహాయ మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా శ్రీదేవి



కాకినాడ క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పెంకే శ్రీదేవిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె కాకినాడ బార్ అసోసియేషన్‌లో 24 ఏళ్లుగా న్యాయవాదవృత్తిలో కొనసాగుతున్నారు. శ్రీదేవిని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, సీహెచ్ చంటి, పలువురు న్యాయవాదులు అభినందించారు.


రాజోలులో హెడ్ పోస్టాఫీసును ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రతి పోస్టల్ ఉద్యోగీ ఓ మొబైల్ ఏటీఎం

- ఇకపై అందుబాటులో లేని సేవలంటూ ఉండవు.. అభివృద్ధి దిశగా పోస్టాఫీసులు
- కేంద్ర కమ్యూనికేషన్స్ గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి పెమ్మసాని
- రాజోలులో రూ.2.27 కోట్లతో నిర్మించిన హెడ్‌పోస్టాఫీస్‌కు ప్రారంభోత్సవం

రాజోలు,జూలై17(ఆంధ్రజ్యోతి): ప్రతీ పోస్టల్ ఉద్యోగిని మొబైల్ ఏటీఎంగా మార్చే ప్రత్యేక కార్యక్రమం చేపట్టబోతున్నామని కేంద్ర కమ్యూనికేషన్స్ గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రతీ గ్రామంలో పోస్టాఫీసు ద్వారా అందుబాటులో లేని సేవలేవీ ఇకపై ఉండవన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో పోస్టాఫీసులన్నీ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం రాజోలులో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.2 కోట్ల 27లక్షల 45 వేలతో నూతనంగా నిర్మించిన రాజోలు హెడ్ పోస్టాఫీసు కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం శివకోడు శ్రీమంగెన గంగయ్య తెలగా కల్యాణ మండపంలో అమలాపురం ఎంపీ హరీష్‌బాలయోగి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాతకాలంలో పోస్టాఫీసు అంటే కేవలం లేఖలు పంపించే ప్రదేశం మాత్రమే అనిపించేదని, కానీ ఈ రోజుల్లో సేవింగ్స్, పేమెంట్స్ బ్యాంకు, పార్శిల్, డెలివరీ కేంద్రంగా మారిందన్నారు. కేవలం ఒకట్రెండు రోజుల్లోనే డెలివరీ వంటి సాంకేతిక సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గతేడాది రూ.5 వేల కోట్లతో దేశవ్యాప్తంగా పోస్టల్ ఐటీ వ్యవస్థను పునరుద్ధరించిందని తెలిపారు. ప్రతీ పోస్టాఫీసుకు ఆధునిక సాంకేతికత అందజేశామని పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా వందలాది కోట్ల రూపాయలు గ్రామాల్లో పోస్టాఫీసు సేవల ద్వారానే చేరాయని అన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ విశిష్ట సేవలు అందిస్తున్న పోస్టల్ శాఖ ప్రజల మధ్య వారధిగా పనిచేస్తుందన్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి మాట్లాడుతూ పోస్టల్ వ్యవస్థ అభివృద్ధి కోసం తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. అనంతరం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మిడి ఇజ్రాయిల్ ప్రసంగించారు. తొలుత రాజోలు హెడ్ పోస్టాఫీసు ఆవరణలో శిలాఫలకాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మట్టా శైలజ, ఎంపీటీసీ కె.పుష్పలత, సర్పంచ్ ఆర్.జ్యోతి, జాయింటి కలెక్టర్ టి.నిషాంతి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ బీపీ శ్రీదేవి, విశాఖపట్నం రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ డీఎస్వీఆర్ మూర్తి, రాజోలు హెడ్ పోస్టుమాస్టర్ జి.శివప్రసాద్, తహశీల్దార్ సీహెచ్ భాస్కర్, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, సెక్రటరీ రెహ్మాన్ పాల్గొన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి : చినరాజప్ప


పెద్దాపురంలో ఉప తపాలా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

- పెద్దాపురం పోస్టల్ భవనాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన పెమ్మసాని

పెద్దాపురం,జూలై17(ఆంధ్రజ్యోతి): తపాలా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. కాకినాడ జిల్లా పెద్దాపురం రామారావుపేటలో రూ.1.70 కోట్లతో నిర్మించిన ఉప తపాలా కార్యాలయ భవనాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్లశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ తపాలా శాఖ తన సేవల విస్తరణలో మరో ముందడుగు వేసిందన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ తపాలా శాఖ గ్రామీణ ప్రాంతాల్లో సైతం డిజిటల్ సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, పోస్టల్ సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ అనిల్, రామకృష్ణ, రమణ మూర్తి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


ఏపీఈపీడీసీఎల్ నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

క్షేత్ర స్థాయిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

- ట్రాన్స్‌కో ఉమ్మడి రాజమహేంద్రవరం సర్కిల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

కాకినాడ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, జేఎల్‌ఎం జీఆర్-2 కార్మికులకు డిపార్ట్‌మెంట్ రూల్స్ వర్తింపజేయాలని ట్రాన్స్‌కో ఉమ్మడి రాజమహేంద్రవరం సర్కిల్ జిల్లా అధ్యక్షుడు పీఎస్‌ఎస్ వెంకటేశ్వరరావు కోరారు. గురువారం కాకినాడలోని శాంతిభవన్ సమావేశ హాలులో ఏపీఈడీసీఎల్ ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎ.రాజారత్నం మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, పెరిగిన పని భారానికి అనుగుణంగా అదనపు పోస్టులు మంజూరు చేయాలని కోరారు. జిల్లా కోశాధికారి ఎస్‌కే బషీర్ మాట్లాడుతూ నాలుగు డీఏలను సత్వరం చెల్లించాలన్నారు. రాష్ట్ర నాయకులు టీసీహెచ్ వెంకటరావు, సరెళ్ల సత్యనారాయణ, దమ్ము సత్తిబాబు, జిల్లా ప్రచార కార్యదర్శి రమేష్ (జగన్), రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు ఎంసీహెచ్‌ఎస్‌ఎస్ కుమార్‌బాబు, కార్యదర్శి పీవీ రమణ, అమలాపురం డివిజన్ అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, కార్యదర్శి బీసీహెచ్ సాహెబ్, రాజమహేంద్రవరం టౌన్ డివిజన్ అధ్యక్షుడు జి.గణేష్, కార్యదర్శి కె.శ్రీనివాస్, రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ అధ్యక్షుడు ఎంసీహెచ్ అప్పలరాజు, కార్యదర్శి పిల్లి ప్రసాద్, కోశాధికారి శివ, జగ్గంపేట డివిజన్ అధ్యక్షుడు నాయుడు, కార్యదర్శి రాజు, కాకి నాడ డివిజన్ అధ్యక్షుడు కె.జాన్‌వెస్లీ, కార్యదర్శి నాగేంద్ర, పైడిరాజు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు. ఆయా డివిజన్ల నాయకులు తమ డివిజన్లలోని వివిధ సమస్యలపై చర్చించారు.

జాతీయ జూనియర్ హాకీ ఉమెన్ చాంపియన్‌షిప్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు

సక్రమ ఏర్పాట్లు చేయాలి

- కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జాతీయ జూనియర్ హాకీ ఉమెన్ చాంపియన్‌షిప్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సక్రమ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కాకినాడ జిల్లా జాయింట్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. ఈ రెండింటికి సంబంధించి కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఆయన జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, ఆర్డీవో మల్లిబాబు, మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనరు సుధాకర్, ఎస్‌ఈ వెంకటరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కృష్ణారావు, హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 20వ వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, 3 నుంచి 20వ తేదీ వరకు జాతీయ జూనియర్ హాకీ చాంపియన్‌షిప్ కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతాయన్నారు. ఆర్మీ ర్యాలీకి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13 ఉమ్మడి జిల్లాల నుంచి అభ్యర్థులు హాజరు కానున్నారు. హాకీ పోటీలకు దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది మహిళా క్రీడాకారులు, 200 మంది సహాయక సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో రోజుకు సుమారు 800 పాల్గొనే అవకాశమున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జేసీ ఆదేశించారు.

సత్యదేవా.. అసత్యం కనవా..!

- నకిలీ రసీదులతో పీఎఫ్ కాజేసేందుకు ఏజెన్సీ కుట్ర
- ఆలయంలో పనిచేస్తున్న 350 మంది పారిశుధ్య కార్మికులు
- దేవస్థానంలో ఒక అధికారి వెనకుండి నడిపించిన వైనం
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన..



అన్నవరం ఆలయ దేవస్థానం

అన్నవరం, జూలై17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో పారిశుధ్య కార్మికులను సరఫరా చేసే కనకదుర్గ కాంట్రాక్ట్ సంస్థ ఆలయ అధికారులనే బురిడీ కొట్టించింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే ఆలయంలో సుమారు 350 మంది వరకు పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరి మూడునెలల పీఎఫ్ సొమ్మును తన జేబులో వేసుకునే దురుద్దేశంతో సంబంధిత ఏజెన్సీ మోసానికి పాల్పడినట్టు తెలుస్తోంది. ఈ విషయం శానిటరీ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారికి తెలిసినప్పటికీ ... ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా మిన్నకుండిపోయి తన పాత్ర పోషించినట్టు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళితే అన్నవరం దేవస్థానంలో పారిశుధ్య కార్మికుల సరఫరాకు నెలకు రూ. 59 లక్షలు దేవస్థానం చెల్లించేలా దేవాదాయశాఖ కమిషనర్ అనుమతితో ఒక సంస్థ నామినేట్ చేసుకుంది. అయితే పారిశుధ్య కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు ఈ సంస్థకు చెల్లిస్తే వారు కార్మికులకు నెలవారీగా అం దించాలి. దీంతోపాటుగా పీఫ్ సొమ్మును కాంట్రాక్ ఏజెన్సీ కార్మికుల ఖాతాకు జమచేయాలి. కాంట్రాక్ట్ సంస్థ పీఎఫ్ డబ్బులు సరిగ్గా చెల్లించినట్టు దేవస్థానం అధికారులకు చూపితేనే దేవస్థానం ఆ నిధులు విడుదల చేస్తుంది. ఇక్కడే సదరు సంస్థ తన కుయుక్తిని ప్రదర్శించింది. మార్చి నుంచి పీఎఫ్ చెల్లించినట్టు నకిలీ రశీదులు చూపించి దేవస్థానం నుంచి మొత్తాన్ని జమ చేసుకుని కార్మికుల జీతాలు మాత్ర మే చెల్లించి, పీఎఫ్ సొమ్ము చెల్లించకుండా జాప్యం చేసింది. ఈ విషయాన్ని వారంరోజుల క్రితం ఛైర్మన్ రోహిత్ దృష్టికి పారిశుధ్య కార్మికులు తీసుకెళ్లగా, ఆయన దేవస్థానం శానిటరీ విభాగ అధికారులతో మాట్లాడి, ఇందులో సంబంధిత ఏజెన్సీ ఉంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించగా, ఆగమేఘాలపై మూడునెలల పీఎఫ్ సొమ్మును ఈనెలలో మూడు విడతలగా కార్మికుల ఖాతాల్లో సదరు సంస్థ జమచేసింది. ఇంతా జరుగుతున్నా ... శానిటేషన్ విభాగ అధికారులు ఏమి చేస్తున్నారనే విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. ఈ విషయం ఈవో సుబ్బారావు దృష్టికి చేరడంతో దీనిపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని శానిటరీ విభాగ ఏఈవో, సూపరెంటెండెంట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించడంతో గురువారం వారు దీనిపై విచారణ చేపట్టగా, మూడు నెలల సొమ్ములకు నకిలీ రసీదులు సృష్టించి వాటికి సంబంధించి ఈనెలలో మూడు విడతలగా సిబ్బంది పీఎఫ్ ఖాతాల్లో జమ చేసినట్టు గుర్తించారు. అయితే మోసానికి పాల్పడిన ఈ సంస్థపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచిచూడాలి. ఈ విషయం బయటకు పొక్కకుంటే త్వరలోనే ప్రధానాలయాలన్నింటికీ సెంట్రలైజ్డ్ కాంట్రాక్ట్ ఖరారవుతుందనే సమాచారంతో ప్రస్తుత ఏజెన్సీ సంస్థ వాటిని కాజేయాలనే దురుద్దేశంతో ఈ మోసానికి పాల్పడినట్టు తెలుస్తోంది.

చాకుతో పొడిచి... పరారై..!

- ప్రియుడి చేతిలో ప్రియురాలి దారుణ హత్య
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బి.సావరంలో ఘటన
- రెండు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలింపు



ఓలేటి పుష్ప (ఫైల్‌ఫొటో)

రాజోలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరంలో గురువారం విషాదం చోటుచేసుకుంది. ప్రియుడి చేతిలో ప్రియురాలు దారుణ హత్యకు గురైంది. దీనికి సంబంధించి రాజోలు ఎస్‌ఐ రాజేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బి.సావరం సిద్ధార్థ నగర్‌లో ఓలేటి పుష్ప (22), షేక్ షమ్మా(22) ఓ అద్దె ఇంట్లో ఉంటూ సహజీవనం చేస్తున్నారు. పుష్పకు గతంలో వివాహమై భర్త నుంచి విడాకులు తీసుకుంది. ఈమెకు రాజోలుకు చెందిన ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న షేక్ షమ్మాతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. అయితే షమ్మా చెడు వ్యసనాలకు లోనై డబ్బు మోజులో పడి గత కొన్ని రోజులుగా మద్యం తాగొచ్చి పుష్పతో వ్యభిచారం చేయాలని ఒత్తిడి చేస్తున్నాడు. బుధవారం రాత్రి కూడా ఇదే విషయంపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీనికి పుష్ప నిరాకరించడంతో కోపోద్రికుడైన షమ్మా ఆమెను చాకుతో పొట్ట, కాలిపై పొడిచి హత్య చేశాడు. దీన్ని అడ్డుకునే ప్రయత్నం చేసిన పుష్ప తల్లి గంగ, సోదరులను కూడా గాయపరిచి పరారయ్యాడు. తీవ్రంగా రక్తస్రావమైన పుష్ప ఘటనా స్థలంలోనే మృతిచెందింది. డబ్బుల కోసం తన కూతురును మానసికంగా వేధించేవాడని మృతురాలి తల్లి గంగ విలపిస్తోంది. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ టీవీ నరేష్‌కుమార్ వచ్చి పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు.

అంతర్జాతీయ మార్కెట్‌కు గిరిజన ఉత్పత్తులు

- హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ హరిప్రసాద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

రంపచోడవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. రంపచోడవరం మండలం ఆర్కా రెస్టారెంట్‌లో జనసేన నాయకుడు కుర్ల రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన గిరిజనులు వెదురు ఉత్పత్తుల ప్రదర్శనకు హరిప్రసాద్, ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు తయారు చేసిన ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు పొందేందుకు అవసరమైన అనుమతులు తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కళలపై ఉన్న మక్కువతోనే హస్తకళలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇటీవల దేశ వ్యాప్తంగా జరిగిన వన్ డిస్ట్రిక్ వన్ ప్రైస్ అనే హస్తకళల ప్రదర్శనలో 29 బహుమతులకు రాష్ట్రానికి 10 బహుమతులు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే శిరీషదేవి మాట్లాడుతూ కూటమిప్రభుత్వం ఇటువంటి కళలు జాతీయస్థాయిలో గుర్తింపు పొందేందుకు ప్రోత్సహిస్తోందన్నారు. హస్తకళల కార్మికులకు ప్రోత్సాహక రుణాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలిశెట్టి సూర్యనారాయణ, అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి వంపురి గంగులయ్య, లీగల్ సెల్ అధ్యక్షుడు కాకి స్వామి, మండలాధ్యక్షుడు పాపోలు శ్రీనివాస్, 11 మండలాల జనసేన మండలాధ్యక్షులు, వీరమహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు విద్యార్థులకు అస్వస్థత

- ఎండ వేడిమే కారణం



ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శిస్తున్న ఎంఈవో, తహశీల్దార్

జగ్గంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం కాండ్రేగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎండ తీవ్రత కారణంగా విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురయ్యారు. పి.దివ్య (ఎనిమిదో తరగతి), ఏ.మేరీ (ఏడో తరగతి), జి.దుర్గాభవాని (పదో తరగతి), సీహెచ్ దివ్య (పదో తరగతి), ఎం. పావని (పదోతరగతి), ఎ.గనిక లక్ష్మి (ఎనిమిదో తరగతి) ఉన్నారు. ఉదయం పది గంటలకు వారు కళ్లు తిరిగిపోవడంతో ఉపాధ్యాయులు గుర్తించారు. వెంటనే విద్యాకమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు స్పందిస్తూ ఇద్దరిని జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో, మరో నలుగురు ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. విద్యార్థులను తహశీల్దార్ రమేష్, ఎంఈవో ఆర్.స్వామి పరామర్శించారు. వారి పరిస్థితి క్షేమంగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఇప్పటికైనా విద్యార్థులకు విశాలమైన తరగతి గదుల్లో విద్యాబోధన చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ట్రాక్టర్‌ను తగలబెట్టిన దుండగులు

ముమ్మిడివరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఓ రైతు మకాంలో ఉన్న ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు పెట్రోలు పోసి నిప్పంటించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరుకు చెందిన చవటపల్లి సత్యనారాయణకు ముమ్మిడివరం మండలం అయినాపురం శివారు గొరగనమూడి సమీపంలో కొబ్బరితోటలో మకాం ఉంది. అందులో పెట్టగా... దుండగులు ఇంజన్ స్టార్ట్ చేసి పెట్రోలు పోసి నిప్పంటించారు. దీంతో ట్రాక్టర్ టైర్లు, ఇంజను భాగం కాలిపోయింది. దీనిపై సదరు ట్రాక్టరు యజమాని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ట్రాక్టరు విలువ సుమారు రూ. ఐదు లక్షలు ఉంటుందన్నారు. అమలాపురం డీఎస్పీ ప్రసాద్ ఆదేశాల మేరకు ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి వెళ్లి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. ట్రాక్టరు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'పురుషోత్తపట్నం' సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

- రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసా నంద సరస్వతి స్వామి



మాట్లాడుతున్న శ్రీనివాసానంద స్వామి

ఎటపాక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపట్నంలోని దేవస్థానం భూముల్లో నెలకొన్న భూ వివాదం ఎనిమిది దశాబ్దాలుగా కొనసాగుతోందని, దీనిపై రైతులు, భద్రాచలం దేవస్థానం అధికారులు కమిటీలుగా ఏర్పడి సామరస్యంగా పరిష్కరించుకోవాలని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామి, సాధు పరిషత్ గౌరవ అధ్యక్షుడు అట్లూరి నారాయణరావు అన్నారు. శ్రీనివాసానంద సరస్వతి స్వామి, గౌరవ అధ్యక్షుడు నారాయణరావుతోపాటు హిందూ సంఘాల నాయకులు గురువారం పురుషోత్తపట్నంలోని దేవస్థానం అధికారులు, స్థానిక రైతుల మధ్య జరుగుతున్న భూవివాదంపై నిజనిర్ధారణ కమిటీగా పర్య టించారు. ఈ సందర్భంగా విలేకరుల సమా వేశంలో వారు మాట్లాడారు. గ్రామంలో తరతరాలుగా ఈ భూమిని నమ్ముకుని జీవిస్తున్న వారికి అన్యాయం చేస్తే ఊరు కోబోమన్నారు. దేవస్థానం అధికారులు భూములకు పర్య వేక్షకులుగా ఉండకుండా ఉన్న భూములను అమ్మేస్తున్నారని ఆరోపించారు. రామయ్య భూములు అన్యమతస్తుల ప్రార్థనా మందిరాలు, మిషనరీ స్కూళ్లకు 20 ఎకరాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. వారికి దేవస్థానం అధికారులు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఎటపాక సీఐ కన్నపరాజు ఆధ్వర్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

మందుబాబులకు జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి కాకినాడ ఐదో ఏజేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ ఎస్‌కే షరీన్ జైలు, జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ 1, 2 సీఐలు ఎన్. రమేష్, డి.రామారావు తమ సిబ్బందితో బుధవారం రాత్రి బ్రీత్ ఎనలైజర్లతో పరిశీలించగా వీరంతా పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి ఇందులో ఒకరికి నాలుగు రోజులు, మరో ఇద్దరికి మూడురోజులు, మరో నలుగురికి రెండు రోజులు , ఇద్దరికి ఒకరోజు చొప్పున జైలు శిక్ష విధించారు. మరో తొమ్మిది మందిలో ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున మొత్తం రూ. 90,000 జరిమానా విధించినట్టు సీఐ రమేష్ తెలిపారు. పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెరవలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పెరవలి మండలంలోని జాతీయ రహదారి ఖండవల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారుజామున ఆచంట మండలం వల్లూరుకి చెందిన నార్కిమిల్లి వెంకటేశ్వరరావు (42) అనే వ్యక్తి ట్రాక్టర్‌పై పంగిడి నుంచి మెటల్ వేసుకురావడానికి తన గ్రామం నుంచి బయలుదేరాడు. ఈక్రమంలో ఖండవల్లి వద్దకు వచ్చేసరికి రోడ్డుపై అడ్డుగా ఏర్పాటు చేసిన వేగ నియంత్రణ ఐరన్ డ్రమ్ములను గమనించకపోవడంతో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న వెంకటేశ్వరరావు ట్రాక్టర్‌పై నుంచి రోడ్డుపై పడిపోవడంతో ట్రాక్టర్ ట్రాలీ టైరు అతనిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

జంతు సంరక్షణలో హైకోర్టు ఆదేశాలు పాటించాలి

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ జంతువుల సంరక్షణ కోసం తప్పనిసరిగా సొసైటీలను నియమించాలని, షెల్టర్లను ఏర్పాటు చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ఛైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. జంతువులపై హింస నివారణకు సొసైటీల ఏర్పాటు, నియంత్రణ నియమాలు, కార్యాచరణపై గురువారం ఆమె ఉమ్మడి తూర్పుగోదావరిలోని వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కొన్ని చోట్ల సొసైటీలు, షెల్టర్లు లేవని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం చొరవ చూపి వాటిని ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన స్థలం, నిధులు కేటాయించాల్సిందిగా కలెక్టర్లకు లేఖ రాస్తామన్నారు. సొసైటీల వివరాలు, వాటి ద్వారా సంరక్షించిన జంతువుల సంఖ్య తదితర సమాచారాన్ని ప్రతి నెలా డీఎల్ఎస్ఏకు అందజేయాలన్నారు. హైకోర్టు తీర్పులో సూచించిన జంతు సంరక్షణ చర్యలను తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తే కోర్టు ధిక్కారణ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని పీడీజే హెచ్చరించారు. జంతువులకు కూడా హక్కులు ఉంటాయన్నారు. వాటిని తరలించే సమయంలో పశుగ్రాసం, నీరు తప్పక అందించాలన్నారు. వాహనాల్లో కనీసం కదిలే అవకాశం కూడా లేకుండా జంతువులను తరలించడం క్రూరత్వం కిందకు వస్తుందన్నారు. ఇలా అక్రమంగా జంతువులను తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు, రవాణా శాఖలను ఆదేశించారు. పట్టణాలు/నగరాల్లో జంతువులను రోడ్లపై వదిలిపెట్టరాదన్నారు. గాయపడిన జంతువుల చికిత్సకు అంబులెన్సులు ఉన్నాయని, ఆ సదుపాయాన్ని నెం.1962కి ఫోన్ చేయడం ద్వారా వినియోగించుకోవచ్చని ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఏసీబీ కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యువల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): జోన్-1, జోన్-2 పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులను 2025-2026 విద్యాసంవత్సరానికి రెన్యువల్ చేయడానికి దరఖాస్తులు కోరుతున్నామని రాజమహేంద్రవరంలోని కళాశాల విద్యాశాఖ ప్రాంతీయ విద్యాసంయుక్త సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-1లో 139, జోన్-2లో 178 పోస్టులకు రెన్యువల్ చేయనున్నట్టు చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ నాటికి కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేసిన వారు మాత్రమే అర్హులని, అలాగే 2025, జూన్ 1వ తేదీ నాటికి 60 ఏళ్లు నిండిన వారు రెన్యువల్‌కు అర్హులు కాదని తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకులు ఈనెల 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కు దరఖాస్తు చేసుకోవాలని, 21 నుంచి 23వ తేదీ వరకూ జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో కౌన్సిలింగ్ జరుగుతుందని తెలిపారు. రెన్యువల్ అయిన అధ్యాపకులు 25వ తేదీన అగ్రిమెంట్ చేసుకోవాలని ప్రాంతీయ విద్యా సంయుక్త సంచాలకులు పేర్కొన్నారు.

ముంచుకొస్తున్న మలేరియా

- కోతులగుట్ట ఆస్పత్రిలో రోజుకు పది కేసులు
- బ్రెయిన్ మలేరియా కేసులు ఎక్కువగానే వస్తున్నాయి: డాక్టర్ మహేష్‌బాబు



కోతులగుట్టలో మలేరియాతో బాధపడుతున్న మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ మహేష్‌బాబు

కూనవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని విలీన మండలాల్లో మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. రోజురోజుకు జ్వరాలు పెరగడంతో రోగులు ఆసుపత్రి బాట పడుతున్నారు. కూనవరం మండలంలోని కోతులగుట్ట ఆస్పత్రి రోగులతో కిక్కిరిసిపోతోంది. రోజుకు 8నుంచి 10 మలేరియా కేసులు నమోదవుతున్నాయి. వీరిలో ఎక్కువగా బ్రెయిన్ మలేరియా కేసులు ఉండడంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని భగవాన్‌పురం గ్రామానికి చెందిన ఓ ఇంట్లో నలుగురికి మలేరియా జ్వరాలు రావడంతో ప్రస్తుతం వారు కోతుల గుట్ట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అడవికి దగ్గర్లో ఉన్న గ్రామాల్లో ప్రతి ఇంట్లో ఒకరు మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం, ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం కారణంగానే ఈ జ్వరాలు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. మండలంలో ప్రజలు మలేరియా జ్వరాలతో ఆస్పత్రి పాలవుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మలేరియా జ్వరాలపై కోతుల గుట్ట ఆసుపత్రి సూపరింటెండెంట్ మహేష్‌బాబును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కూనవరం మండలంలో మలేరియా జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్న మాట వాస్తవమన్నారు. ఆస్పత్రిలో రోజుకు ఎనిమిదికి పైగానే మలేరియా కేసులు నమోదవుతున్నాయని ఆయన తెలిపారు. వీరిలో బ్రెయిన్ మలేరియా కేసులు కూడా వస్తున్నాయని, వారికి సరైన చికిత్స అందిస్తున్నామని స్పష్టం చేశారు.

సాధారణ స్థాయికి గోదావరి ప్రవాహం



రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో వరద నీటి ప్రవాహం

ధవళేశ్వరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉధృతంగా ప్రవహించిన గోదావరి కొద్దిరోజులుగా తగ్గుతూ ప్రవహిస్తూ సాధారణస్థాయికి చేరుకుంటోంది. దీంతో తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్లను దించి వేసి నీటి విడుదలను నియంత్రిస్తున్నారు. మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను దించి నీటి విడుదలను నిలిపివేయగా ధవళేశ్వరం, ర్యాలీ ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను 10 మిల్లీమీటర్ల మేర ఎత్తి 36,154 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2600క్యూసెక్కులు పశ్చిమడెల్టాకు 7200క్యూసెక్కులు చొప్పున 14,800క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా తగ్గుతున్న నీటి మట్టం గురువారం సాయంత్రానికి 14.50 అడుగులకు చేరుకుంది.

- డెల్టా కాలువలకు 14,800 క్యూసెక్కుల నీరు విడుదల

చిన్నారి మోహన మృతి బాధాకరం: ఎంపీ



చిన్నారి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న ఎంపీ పురందేశ్వరి

కడియం, జూలై 17(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలో చైతన్యనగర్‌కు చెందిన డొక్కా ఈశ్వర్-శ్రావణిల కు మార్తె మోహన అనే చిన్నారి మృతి చెందడం బాధాకరమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బాధిత కుటుంబాన్ని ఆమె గురువారం పరామర్శించి ఓదార్చారు. మోహనకు స్పైనల్ మస్క్యులర్ ఆట్రోఫి (ఎస్ఎంఏ) అనే సమస్య ఉందని, వైద్యం కోసం కోట్ల విలువైన ఇంజక్షన్ చేయాలని హైదరాబాద్ వైద్యులు చెప్పగా విషయాన్ని ఎంపీ పురందేశ్వరి దృష్టికి, రాజమహేంద్రవరం వచ్చిన కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మోహన వైద్యం కోసం చర్యలు చేపట్టామని, పీఎంవో కార్యాలయానికి నివేదించడతో పాటు, నిధుల కోసం ప్రయత్నిస్తుండగా మోహన మృతి చెందిందని ఎంపీ విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఆకుల శ్రీధర్, బొర్సు సుబ్రహ్మణ్యం, దాసరి ముత్యం, కొత్తపల్లి శివ, తాలాబత్తుల భాస్కర్, బొప్పన లోవరాజు పాల్గొన్నారు.

అనారోగ్యం తాళలేక ఆత్మహత్య

- రౌతులపూడి సీహెచ్‌సీ ఆవరణలో ఉరివేసుకున్న వృద్ధుడు



రౌతులపూడి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్లుగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వ్యక్తి ఆసుపత్రి ఆవరణలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆసుపత్రి సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రౌతులపూడి గ్రామానికి చెందిన లోకారపు చిన్న అప్పలనాయుడు(79) ఇరవై ఏళ్లుగా ఆయాసం, కడుపునొప్పి, గుండె సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నాడు. రెండ్రోజుల క్రితం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో బంధువులు స్థానిక సీహెచ్‌సీలో చేర్పించారు. బుధవారం రాత్రి వరకూ చికిత్స తీసుకున్న అతడు గురువారం తెల్లవారేసరికి బంధువులు చూడగా ఆసుపత్రి ఆవరణలో ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఉన్నాడు. ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వగా స్థానిక ఎస్ఐ కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నిడదవోలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో సైకిలిస్ట్ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. నిడదవోలు మండలం గోపవరం గ్రామంలో గురువారం జరిగిన ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తిని గోపవరం గ్రామానికి చెందిన కొప్పర్తి మహరాజ్(47)గా గుర్తించినట్టు సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

రాజమండ్రి మార్కెట్‌కు చిత్తూరు మామిడి

రుమాని, బంగినపల్లి, నీలం , కలెక్టర్ రకాలు.. కిలో మామిడి పండ్లు రూ.100



రాజమహేంద్రవరం మార్కెట్లో చిత్తూరు మామిడికాయలు

రాజమహేంద్రవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల్లో జూన్ నెలలోనే మామిడి పండ్ల సీజన్ పూర్తి కావడంతో చిత్తూరు మామిడి పండ్లు మార్కెట్‌లోకి వస్తున్నాయి. రెండు మూడు రోజులకోసారి 10 టన్నుల కాయలు రాజమహేంద్రవరం మార్కెట్‌కు వస్తున్నాయి.ఇక్కడ రిటైల్ మార్కెట్లో కిలో రూ.100 వరకూ విక్రయిస్తున్నారు. చిత్తూరు నుంచి హోల్‌సేల్ వ్యాపారులు కిలో రూ.30 వరకూ కొని తెస్తున్నట్టు చెబుతున్నారు. హోల్ సేల్‌లో కిలో రూ.50కు పైగానే అమ్ముతున్నారు. అక్కడ నుంచి ఎక్కువగా రుమాని, బంగినపల్లి, నీలం రకాలు వస్తున్నాయి.గోదావరి జిల్లా ప్రజలకు రుమాని రకం కొత్తగా పరిచయమే. బాగానే తింటున్నారు. బంగినపల్లి అందరికీ ఇష్టమే. ఇక నీలం రకం ఓమాదిరిగా తింటారు. కలెక్టర్ రకం మామిడి ఒకటి ఉంది. ఇటీవల చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో మాజీ సీఎం జగన్ రోడ్ల మీద పడేసినట్టు చెబుతున్న మామిడి కలెక్టర్ రకం. అది పచ్చళ్లకు పనిచేయదు. జ్యూస్‌కి, మామిడితాండ్రకు ఉపయోగపడుతుంది. కొందరు పచ్చికాయలను ముక్కలుగా కోసి, ఉప్పుకారం పెట్టి అమ్ముతున్నారు. అయితే ఇటీవల పండ్లను సహజంగా ముగ్గ పెట్టకుండా రసాయ నాలతో మగ్గించడం వల్ల ప్రజలు తినడానికి జంకుతున్నారు. చిత్తూరు మామిడి రైతులు రాష్ట్రంలో మార్కెట్లలోకి పంపిస్తే, మార్కెట్ బాగానే లభిస్తుందనే దానికి రాజమండ్రి మార్కెట్ ఓ ఉదాహరణ.

బాలుడి మృతి అత్యంత బాధాకరం

ఎంపీ పురందేశ్వరి పరామర్శ

దివాన్‌చెరువు, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం దివాన్‌చెరువులో ఇటీవల గుంతలో పడి కడమంచి శ్రీను అనే బాలుడు మృతిచెందడం అత్యంత బాధాకరమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. దివాన్‌చెరువులోని బాలుడి కుటుంబ సభ్యులను గురువారం ఆమె పరామర్శించి బాలుడి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ తాము నివసిస్తున్న ప్రాంతం పల్లపు ప్రాంమని, వర్షం కురిస్తే చాలు ముంపుకు గురవుతోందని, శాశ్వత గూడు కల్పించాలని విజ్ఞప్తి చేశా రు. అలాగే శ్రీరాంపురంలో పితృ వియోగం తో బాధ పడుతున్న బీజేపీ నాయకుడు బోయిడి దుర్గారావును, శ్రీకృష్ణపట్నంలో పుత్రవియోగంతో బాధపడుతున్న బీజేపీ నాయకుడు ఏలేటి దుర్గారావును, అల్లుడు కోలా లోకేశ్ అకాల మృతితో దుఃఖంలో ఉన్న బీజేపీ సీనియర్ నాయకుడు సోడసాని సత్యనారాయణను ఎంపీ పురందేశ్వరి, బీవీఆర్ చౌదరి పరామర్శించారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కినాగేంద్ర, నాయకులు కందుల బాబూరాయుడు, ఖండవిల్లి లక్ష్మి, వంక మల్లిబాబు, మల్లారపు సత్యానందం, గంగిశెట్టి చంటిబాబు, అడబాల గణపతి, ఆళ్ల శివనాగరాజు,ఏపీఆర్ చౌదరి పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

గోకవరం, కామరాజుపేట సొసైటీ సంఘాల ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే నెహ్రూ



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం, జూలై17(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి త్రిసభ్య కమిటీ పాలకవర్గాలు కృషి చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం, కామరాజుపేట గ్రామాల్లో గురువారం నిర్వహించిన త్రిసభ్య కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు ఆయన విచ్చేశారు. గోకవరం సొసైటీ చైర్మన్‌గా గాజింగం సత్యనారాయణ (సత్తిబాబు), సభ్యుడిగా వెదురుపాక గ్రామానికి చెందిన కొత్తల వీరఅప్పారావు, కామరాజుపేట సహకార సొసైటీ చైర్మన్‌గా పిర్ల వెంకటేశ్వరరావు, సభ్యులుగా ఈదివిల్లి కొండబాబు, గంటా వీరవెంకటనాయుడు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవి అలంకారం ప్రాయంగా కాకుండా బాధ్యతగా భావించి సేవలందించాలని, సొసైటీల్లో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.కార్యక్రమంలో నాయకులు అడపా భరత్ కుమార్, మంగరాతి రాము, పాలూరి బోస్, దాసరి తమ్మన్నదొర, పెద్దాడ వెంకన్నదొర, మట్టా మంగరాజు, గళ్ళా రాము, ఉంగరాల ఆది విష్ణు, పోసిన ప్రసాద్, సీతఃవేలు దాసరి సురేష్‌బాబు, కె.వీరభద్రరావు పాల్గొన్నారు.

కాంపోజిట్ కళాశాలను వేరుచేయాలి

ఉన్నత విద్యామండలి అధికారులకు ఎస్ఎఫ్ఐ వినతి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని కందుకూరి రాజ్యలక్ష్మి కాంపోజిట్ కళాశాలను డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలలుగా వేరుచేయాలని ఎస్ఎఫ్ఐ కోరింది. ఈమేరకు గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ కమిషనర్ కృతికశుక్ల, ఉన్నత విద్యామండలి డైరెక్టర్ నారాయణ గుప్తాలకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగా కందుకూరి విద్యాసంస్థలు ప్రభుత్వపరం అయ్యాయని, అయితే కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాల మాత్రం కాంపోజిట్ కళాశాలగా నడుస్తోందన్నారు. రాజ్యలక్ష్మి కళాశాలలు ప్రభుత్వపరమైనా ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు రావడంలేదని, మధ్యాహ్నభోజన పథకం అమలు కావడంలేదన్నారు. ఈ పరిస్థితుల్లో కాంపోజిట్ కళాశాలను ఇంటర్, డిగ్రీలుగా వేరుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

రాజానగరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లంపూడిలో శ్రీసాయి మాధవి ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజులుగా జరుగుతున్న స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం గురువారం ముగిసింది.ఈ శిక్షణలో జిల్లా వ్యాప్తంగా 174 మంది ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడం, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, అభ్యసనా సామర్థ్యాలు, పాఠశాల అభివృద్ధి వంటి పలు కీలక అంశాలపై తొమ్మిది మంది రాష్ట్ర ఫెసిలిటేటర్స్ నాలుగు రోజులు పాటు శిక్షణ కల్పించారు. అలాగే సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి, జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు శిక్షణా శిబిరాన్ని సందర్శించి పాఠశాలల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుల చేపట్టాల్సిన కీలక ముఖ్యమైన అంశాలను వివరించిదిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంవో గౌరీశంకర్, కైవల్య ప్రతినిధి శైలజ, అనపర్తి ఎంఈవో సత్తిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామ సమష్టి పథక ప్రణాళికలపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ మూర్తి

రాజమహేంద్రవరం రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-సెర్ప్ ఆధ్వర్యంలో మండలంలోని హుకుంపేటలో స్త్రీ శక్తి భవనంలో గ్రామ సమష్టి పథక ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు, సంఘాల ఆధ్వర్యంలోని ఆదాయోపాధి కార్యకర్తలు, గ్రామ స్థాయి కార్యాచరణ బృందాలు పాల్గొన్నాయి. గ్రామ వాస్తవ పరిస్థితుల ఆధారంగా అవసరాల గుర్తింపు,డేటా సేకరణ, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై శిక్షణ ఇచ్చారు. డిజిటల్ మోడల్ యాప్ ద్వారా డేటా నమోదు, ఇంటర్వ్యూలు, సమగ్ర సమాచార సేకరణపై అవగాహన కల్పించినట్టు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ మూర్తి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ డైరె క్టర్ ఎం.సంతోష్‌కుమార్, జాతీయ ట్రైనర్లు, రాష్ట్ర, జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సభ్యులు, సేవా ప్రొవైడర్లు, బ్యాంక్ అధికారులు, 18 మం డలాల నుంచి వచ్చిన వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టీకే

రాజమహేంద్రవరం సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): మునిసిపల్, పంచాయతీ తదితర స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ కేడర్ అంతా సిద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కాలనీలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునిసిపాలిటీల్లో గ్రామాల విలీనం చేయడానికి కోర్టు నుంచి స్టే ఇచ్చిన కొన్నింటికి ఎన్నికలు ఆగిపోయాయని, ఆగిపోయిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో స్టే తెచ్చుకున్న గ్రామాలను మినహాయించి మిగిలిన గ్రామాలను విలీనం చేసి ఎన్నికలు జరిపించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని ఈ ప్రక్రియ మూడునెలలో పూర్తవుతుందని అటుపై ఎన్నికలు జరిపిస్తామన్నారని, ఈ నేపథ్యంలో ఎన్నికలు నవంబరు, డిసెంబరులో ఎన్నికలు ఉండవచ్చని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారని వివరించారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, అరిగెల అరుణకుమారి, అమర్జహబేగం, డాక్టర్ వడయార్ శ్రీనివాస్, సత్తి బుల్లిరెడ్డి, జెటి రామారావు, భద్రందొర పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల



కొంతమూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని, ప్రజలు మెచ్చే విధంగా రాష్ట్రంలో చంద్రన్న పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మండలంలోని కొంతమూరులో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీచేశారు. ప్రజల అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకున్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోను లేని విధంగా పేదలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. రైతులను ఆదుకొనేందుకు త్వరలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.20 వేలు, మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మత్యేటి ప్రసాద్, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, రాష్ట్ర మహిళా కార్యదర్శి మజ్జి పద్మ, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, గోక శ్రీను, కురుకూరి కిషోర్, తాడేపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం: వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని 10, 49, 50 డివిజన్లలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ఆరా తీశారు. ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను తీసుకుని టీడీపీ యాప్‌లో అప్లోడ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరికాన్ని నిర్మూలించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, బొళ్ల ప్రసాద్, కాశీ నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకిరామయ్య, మొకమాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట/అనపర్తి: రంగంపేట మండలం సింగంపల్లి, అనపర్తి మండలం దుప్పలపూడి గ్రామాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా సింగంపల్లిలో ఏడాది కాలంలో రూ.6.02 కోట్లతోను, దుప్పలపూడిలో రూ.5.79 కోట్లతోను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామస్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, గిరజాల సత్తిబాబు, అడబాల వెంకట్రావు, కడిమి సాయిబాబు, మోదుకూరి గోపాలకృష్ణ, సిరసపల్లి నాగేశ్వరరావు, ఎన్‌వీవీ రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి, చిర్ల గంగిరెడ్డి, కుత్సం కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సింగంపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న మనోజ్‌రెడ్డి

ఆగస్టు 21న రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమిట్

పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్‌కు బంగారు బాట వేయాలనే సంకల్పంతో వచ్చేనెల 21న రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమిట్-2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక హోటల్ లాహస్పిన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరల్డ్ ఎంటర్ ప్రెన్యూర్ డే సందర్భంగా భవాని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ సమిట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన నగర ప్రజలు అందునా యువత కోసం ఏబీసీటీ ప్రోగ్రాం, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం నాలుగు నెలలకు ఒక బ్యాచ్‌కు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి బ్యాచ్‌లో 23మందికి రూ.6లక్షల ప్యాకేజీతో ఉద్యోగవకాశాలు లభించాయన్నారు.ఎంటర్‌ప్రెన్యూర్ సమిట్ ద్వారా ఐడియా పిచ్ పోటీలు పెట్టి మంచి ప్రెజెంటేషన్ చేసిన ముగ్గురికి నగదు బహుమతులు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురికి టాటా ఇంక్యుబేషన్ సెంటర్‌లో అవకాశం కల్పిస్తామని వాసు చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకు చదువుకునే విద్యార్థులు పాల్గొని తమ ఆలోచనలు పంచుకోవచ్చన్నారు.ఈ సందర్భంగా సమిట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. డీఈవో కే, ఆర్ ఐవో, పలు విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అమ్మాయిలను ఇబ్బంది పెడితే ఊరుకోం

నగరంలో పాఠశాలలు, కళాశాలల వద్ద అమ్మాయిలను ఆకతాయిలు ఇబ్బందులు పెడితే ఊరుకోబోమని ఎమ్మెల్యే వాసు హెచ్చరించారు. తాను ఇటీవల 44వ డివిజన్‌లో పర్యటించినప్పుడు ఓ అమ్మాయి.. బైక్‌పై వెంట పడుతూ ఇబ్బందిపెడుతున్న ఆకతాయి గురించి చెప్పిందని, వెంటనే త్రీటౌన్ పోలీసులకు చెప్పగా ఆకతాయిని స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించారన్నారు. రాజమహేంద్రవరంలో మహిళలు, బాలికల వెంటపడి ఇబ్బందులు పెడితే తాటతీయిస్తామని, ఈ విషయంలో తనమన బేధం ఉం డదని చెప్పారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కాశి నవీన్‌కుమార్, దొండపాటి సత్యంబాబు, మజ్జి రాంబాబు, వర్రే శ్రీనివాస్, నక్కా చిట్టిబాబు, బుడ్డిగ రాధా, రెడ్డి మణి, ఉప్పులూరి జానకిరామయ్య, దాస్యం ప్రసాద్ పాల్గొన్నారు.

కోరుకొండ నరసన్న ఆలయానికి రోప్‌వే

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): కోరుకొండ నరసింహస్వామి కొండ దిగువ ప్రాంతం నుంచి శిఖరాగ్రం వరకు 0.25కిలోమీటర్ల మేర రోప్‌వే ఏర్పాటుకు త్వరలోనే టెండర్లు పిలవనున్నామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. నరసింహస్వామి ఆలయం వద్ద గురువారం దేవస్థానం పాలక మండలి సభ్యులు, గ్రామపెద్దలు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన విచ్చేసి దేవస్థానం వద్ద ఉన్న ప్రస్తుత లోటుపాట్లపై చర్చించి వాటిని తక్షణం పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. దేవస్థానం అభివృద్ధికి రూ.36 కోట్లతో పనులకు టెండర్లు పిలుస్తామన్నారు. కోరుకొండ దేవస్థానాన్ని టీటీడీకి దత్తత దేవస్థానంగా అప్పగించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, బదిరెడ్డి దొర, కటకం చలం, తాటికొండ శ్రీను, ఉప్పలపాటి వీరాస్వామి, యర్రంశెట్టి పోలారావు, దేవర దుర్గాప్రసాద్, కమిడి శ్రీరాం, అడ్డాల శివ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

బిక్కవోలు, జూలై 17(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలందరూ తీసుకున్న రుణాలతో వివిధ వ్యాపారాలు చేపట్టి వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎల్ఎం టీమ్ సభ్యులు నాగరాజు, వినోద్ సూచించారు. ఆరికరేవుల గ్రామాన్ని గురువారం ఎన్ఎల్ఎం బృందం సందర్శించి కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరు, ఉపాధి పనులు, హౌసింగ్‌లో గృహనిర్మాణాలు పరిశీలించింది. అనంతరం బృంద సభ్యులు పంచాయతీలో సమావేశం నిర్వహించి ఉపాధి కూలీలకు అందుతున్న వేతనాలు గూర్చి అడిగి తెల్సుకున్నారు. గ్రామంలో విద్య, వైద్య సౌకర్యాలు, డ్రైనేజి వ్యవస్థపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి, హౌసింగ్ డీఈఈ వనమయ్య, మండల పరిషత్ ఏవో నాగేంద్రప్రసాద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీబీ నివారణకు కృషి

• ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
• వంద మంది టీబీ రోగులను దత్తత తీసుకున్న గ్రాసిమ్ ఇండస్ట్రీస్

అనపర్తి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): టీబీ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అనపర్తి ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్ సౌజన్యంతో నిర్వహించిన టీబీ రోగులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ టీబీ బాధిత 100 కుటుంబాలను గ్రాసిమ్ ఇండస్ట్రీస్ దత్తత తీసుకోవడం అభినందనీయమన్నారు. కూటమి నాయకులు కూడా టీబీ బాధితులను దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలన్నారు. గ్రాసిమ్ ఇండస్ట్రీస్ ప్రతినిధి విజయ్ కార్తీక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 100 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నామని అనపర్తి నియోజకవర్గంలో 34 మందిని ముందుగా దత్తత తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా బాధితులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా టీబీ, క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ వసుంధర, డీఐవో డాక్టర్ కోమలి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, సీఎస్ఆర్ఎమ్‌వో పద్మశ్రీ, గ్రాసిమ్ ప్రతినిధి ముని భాస్కరరెడ్డి, నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, ఆళ్ల గోవిందు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

చోరీ సొత్తు స్వాధీనం : డీఎస్పీ

సీతానగరం,జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘుదేవపురం రవీంద్ర కాలనీ సురవరపు మణికంఠ ఇంటిలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. గురువారం డీఎస్పీ వై.శ్రీకాంత్ విలేకరులతో మాట్లాడుతూ కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఎస్.ఐ డి.రామ్‌కుమార్ సిబ్బందితో కలసి ముగ్గళ్ల గోదావరి మాత విగ్రహం వద్ద మధ్యాహ్నం 3గం.లకు రాజమహేంద్రవరం నుంచి సీతానగరం బైక్‌పై వస్తూ పోలీసులను చూసి వెనుకకు తిప్పేందుకు ప్రయత్నించగా నీలంశెట్టి వెంకట వాసు (రవీంద్రకాలనీ) రాజానగరానికి చెందిన గొడ్డు భాను శివ శంకర్‌లను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వారిని విచారించగా మణికంఠ నిడదవోలులో ఉంటున్న అక్క శివకుమారి ఇంటికి తల్లిని తీసుకెళ్లాడు. తిరిగి ఈ నెల 12న ఇంటికి రాగా తలుపులు తెరచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాను బద్దలుకొట్టి ఉండటంతో 4కాసుల బంగారం, 10 తులాల వెండి, రూ1.50 లక్షలు నగదు పోయిందని గుర్తించి పిర్యాదు చేశారని తెలిపారు. నిందితుల నుంచి చోరీ సొత్తుతో పాటు దొంగతనం చేయడానికి ఉపయోగించిన మోటారుసైకిల్ సీజ్ చేసినట్టు డీఎస్పీ పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించారని చెప్పారు.

పశువుల్లో వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

అనపర్తి, జూలై 17(ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ పశువైద్య శిక్షణా కేంద్రం వైద్యులు డాక్టర్ వై.వెంకటేష్ అన్నారు. గురువారం కుతుకులూరు పశువైద్య శాలలో ఏర్పాటు చేసి గర్భకోశ వ్యాధుల పరీక్ష శిబిరంలో ఆయన పాల్గొని పాడి రైతులకు పలు సూచనలు చేశారు.

హాస్టల్ పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లోని పిల్లలకు నిబంధనల ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని, వైద్య సేవల విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి ఆదేశించారు. గురువారం ఆమె బాలికా సదనాన్ని సందర్శించారు. అక్కడి వసతి సదుపాయాలను పరిశీలించారు. సురక్షితమైన తాగునీటిని నిరంతరం అందుబాటులో ఉంచాలని, వసతి గృహాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. డీఎల్ఎస్ఏ అందిస్తున్న ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. అవసరమైన వాళ్లు సంస్థను సంప్రదించాలని కోరారు. అనంతరం సర్వే పర్ ఆధార్ అండ్ యాక్సెస్ టు ట్రేసింగ్ అండ్ హోలిస్టిక్ ఇంక్లూజన్(సాతి) సభ్యులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సర్వే ద్వారా ఇప్పటి వరకూ సాధించిన ఫలితాలపై ఆరా తీశారు. సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బంది కలిగినా సంస్థను సంప్రదించాలన్నారు.

సీఎం చంద్రబాబుకు పెందుర్తి అభిరామ్ వీడ్కోలు



రాజానగరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పర్యటన అనంతరం కర్నూలుకు బయలుదేరుతున్న ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ తనయుడు అభిరామ్ గురువారం ఢిల్లీలో కలిసి ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రాజానగరం నియోజకవర్గంలో రైతులు, విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలపై సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేసినట్టు అభిరామ్ ఇక్కడి విలేకరులకు ఫోన్ ద్వారా వివరించారు.

రావిపాటి ప్రతిభా పురస్కారాల ప్రదానం



పురస్కారాలు పొందిన విద్యార్థులతో ఎక్సైజ్ డీసీ చైతన్యమురళి

కోరుకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం రావిపాటి శ్రీనివాసరావు 11వ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఏనుగుల చైతన్యమురళి చేతులమీదుగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన రిటైర్డ్ జాయింట్ కమిషనర్ దివంగత రావిపాటి శ్రీనివాసరావు త్యాగనిరతిని విద్యార్థులకు వివరించారు. అదే స్ఫూర్తితో చదువులో ప్రగతిని కనబరచాలని కోరారు. బాల్యవివాహాలు, మూఢాచారాలు, ప్రకృతిని ధ్వంసం చేయడం, మద్యపానం వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. అనంతరం 2024-25 విద్యాసంవత్సరానికి ప్రతిభా పురస్కారాలను 15 మంది విద్యార్థులకు అందించి సత్కరించారు. అలాగే రేఖపల్లి విక్రం అందజేసిన బెస్ట్ స్పోర్ట్‌మెన్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో టి.కుశలవ దొర, హెచ్ఎం మణికుమార్, రావిపాటి శ్రీనివాసరావు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు రావిపాటి సత్యవతి, కోలా సత్యనారాయణ, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, కటకం చలం, బదిరెడ్డి దొర, కె.సూర్యనారాయణ, కె.మధుబాబు, తెలగంశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం'

కోరుకొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడమే పీఆర్టీయూ లక్ష్యమని పంచాయతీ రాజ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లా రాజారావు, ప్రధాన కార్యదర్శి వై.అమ్మేష్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కోరుకొండ మండల పీఆర్టీయూ భవనంలో ఇటీవల బదిలీపై వేరే ప్రాంతాలకు వెళ్లిన, పదవీ విరమణ చేసిన, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సత్కరించింది. ఈ సందర్భంగా పల్లా రాజారావు మాట్లాడుతూ 1971లో పీఆర్టీయూ తెలంగాణా ప్రాంతం లో ఏర్పడి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతా విస్తరించిందన్నారు. అప్పటినుంచి ఇప్పటి వరకు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో పీఆర్టీయూ ముందుందని ఉన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సాంబశివరావు, షేక్ రహిమాబేగం, ఎం.శి వనారాయణ, సాదే రాజు, ఎస్. వెంకటేశ్వరరావు, ఎన్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


గ్రామ దేవతలకు సారె



బిక్కవోలు, జూలై 17(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు గ్రామ దేవతలు మదుగులమ్మ, నూకాలమ్మలకు గురువారం గ్రామస్థులు సారెగా 1400 కిలోల స్వీట్లు సమర్పించారు. ముందుగా మదుగులమ్మకు భక్తు లు 800 కిలోల స్వీట్లతో లక్ష్మీనారాయణ స్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అనం తరం గ్రామస్థులకు పంపిణీ చేశారు. అలాగే కొత్తపేటలో వున్న నూకాలమ్మకు ఆపేట వాసులు 600 కిలోల స్వీట్లతో అమ్మ వారికి గ్రామోత్సవం జరిపి ఆలయంలో సమర్పించారు.

కాలేజీ ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు విరాళం

రంగంపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గ్రా మానికి చెందిన కారిదాసు కుమారుడు కారి నాగేంద్ర విరాళం అందజేశారు. గురువారం ఆయన రూ.30 వేల నగదును జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, కొల్లాటి ఇశ్రాయేలు చేతులమీదుగా ప్రిన్సిపాల్ బి.హేమకు అందించారు. ఈ సందర్భంగా నాగేంద్రను పలువురు అభినందించారు.



చినుకు.. పలకరింపు



భానుడి దెబ్బకు విలవిల్లాడిన ప్రజలకు వరుణుడు గురువారం సాయంత్రం చిరుజల్లులతో ఉపశమనమిచ్చాడు..

తలకెక్కించుకోకపోతే ఫైన్!



హెల్మెట్ లేకుండా తిరుగుతున్నారా! అయితే మీరు ఫైన్ కట్టాల్సిందే.. వందో రెండొందలో కాదండోయ్.. ఏకంగా రూ.1035.. తొలిసారి అయితే ఫైన్.. రెండో సారి దొరికారో బైక్ సీజ్.. కేసు నమోదు.. గతంలో కూడా ఇలాగే చెప్పారులే అని కామెడీగా తీసుకుని బైక్ ఎక్కి బయటకు వచ్చారో పోలీసులు సీరియస్‌గా పట్టుకుని ఫైన్ వేస్తారు జాగ్రత్త! ఇదంతా తలకెక్కించుకుని.. హెల్మెట్ పెట్టుకోండి మరి..

- హెల్మెట్ తప్పనిసరి
- లేదంటే జరిమానా
- తొలిసారి రూ.1035
- ముమ్మర తనిఖీలు

హెల్మెట్ పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యంపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు.కొన్నాళ్లుగా హెల్మెట్ లేకుండా పట్టుబడినా కౌన్సెలింగ్ చేసి పంపేవారు. కానీ పరిస్థితిలో మార్పు కానరాక పోవడంతో తనిఖీలు ముమ్మరం చేసి జరిమానా విధిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషను పరిధిలో ప్రతి రోజూ హెల్మెట్ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ కేసులు రాస్తున్నారు. పట్టుబడితే రూ.1035 జరిమానా విధిస్తున్నారు. రాజమహేంద్రవరంలోని చాలా చోట్ల ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తనిఖీలు చేస్తున్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తున్నారు. మొదటిసారి జరిమానా విధిస్తారు.. రెండో సారి హెల్మెట్ లేకుండా పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేసి కేసు కూడా పెడుతున్నారు.

6 నెలలు.. రూ.32.52 లక్షలు ఫైన్

జిల్లాలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడంపై ఈ ఏడాది ఆరు నెలల్లో 14,922 కేసులు పెట్టి రూ.32.52 లక్షల జరిమానాలు విధించారు. వీటిలో 3350 కేసుల్లో రూ.5.54 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. మిగతా చలానాలు పెండింగ్‌లో ఉన్నాయి. హెల్మెట్ లేకుండా ఒకటి కంటే ఎక్కువసార్లు పట్టుబడితే కేసు పెట్టి కోర్టుకు పంపిస్తారు.

హెల్మెట్ లేక.. 124 మంది మృతి

ఈ ఏడాది ఆరు నెలల్లో మొత్తం 304 ద్విచక్ర వాహన ప్రమాదాలు జరగ్గా.. 114 ప్రమాదాల్లో 124 మంది మరణించారు. 190 ప్రమాదాల్లో 295 మందికి తీవ్రమైన గాయాలయ్యాయి. 304 ప్రమాదాల్లో 80 శాతం మంది తీవ్రగాయాలు లేదంటే ప్రాణాలు కోల్పోయారు.



హెల్మెట్ ధరించాల్సిందే : ఎస్పీ నరసింహ కిశోర్

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందే. నగరాలు/పట్టణాల్లో లేదా పలానా చోట్ల హెల్మెట్ అవసరం లేదనే వదంతులు సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నారు. వాటిని నమ్మొద్దు. అలాంటి పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం.



ఢిల్లీలో గురువారం కేంద్ర మంత్రి నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు అందుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

ఆహో..అద్వితీయం!

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 19వ ర్యాంక్ సాధించిన రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో ఈ సారి రాజమహేంద్రవరం కార్పొరేషన్ జాతీయస్థాయిలో 19వ ర్యాంక్ కైవసం చేసుకుని అత్యుత్తమ ఘనత సాధించింది.స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 ర్యాంక్‌లను గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రస్థాయిలో చూస్తే రాజమహేంద్రవరం రెండో స్థానంలో ఉంది. ప్రజల సహకారం, పారిశుధ్య సిబ్బంది కృషి ఫలితంగా రాజమహేంద్రవరం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 2020లో 51వ ర్యాంక్ , 2021లో 41వ ర్యాంక్, 2022లో 97వ ర్యాంక్, 2023లో 59వ ర్యాంక్, 2024-25లో 19వ ర్యాంక్ సాధించింది.గతంలో పోల్చితే ఈ సారి వచ్చిన ర్యాంక్ అత్యుత్తమమైనది. ఈ మేరకు ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అవార్డు అందుకున్నారు. పరిశుభ్రత కోసం తీసుకున్న వినూత్న చర్యల వల్ల క్లీన్ రాజమహేంద్రవరం సాధ్యమైందని కలెక్టర్ అన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాజమహేంద్రవరానికి 19వ ర్యాంక్ రావడం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. కలెక్టర్ వెంట ప్రభుత్వ ఎంయూడీసీ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్,సీడీఎంఏ కమిషనర్ సంపత్‌కుమార్, కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్, ఎంహెచ్‌వో వినూత్న,సీవోసీ ఇన్‌చార్జి రవితేజ ఉన్నారు.



అమృత్ పథకంలో ఆరు స్టేషన్ల అభివృద్ధి

బడ్జెట్ కేటాయింపుపై రైల్వే నోట్

రాజమహేంద్రవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రైల్వే శాఖ బడ్జెట్‌లో రాష్ట్రానికి 2025-26కు సంబంధించి కేటాయింపులపై గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. దానిలోనూ రాజమహేంద్రవరానికి సంబంధించి పాత కూతే వినిపించింది. స్టేషను రీడెవలప్‌మెంట్‌కి రూ.271.43 కోట్లు కేటాయించామని పేర్కొంది. రెండేళ్లలో రానున్న పుష్కరాల నాటికి పనులు పూర్తి కావాలని ప్రజా ప్రతినిధులు పదే పదే విన్నవిస్తున్నా పనులు ఇంకా టెండరు ప్రిపరేషన్ దశలోనే ఉన్నాయని ఆ ప్రకటనలో పేర్కొనడం గమనార్హం. అంటే ఇంకా టెండరు కూడా పిలవలేదు. ఆ ప్రక్రియ పూర్తి కావడానికి ఇంకా ఎన్నాళ్లు పడుతుందో స్పష్టత లేదు.రైల్వే రీడవలప్‌మెంట్ పనులకు నిధులిచ్చినా పనులు మొదలు పెట్టడంలో కాలయాపనపై ఇటీవలే 'ఆంధ్రజ్యోతి' కథనం వెలువరించడం తెలిసిందే. మరో వైపు అనపర్తి, నిడదవోలు జంక్షన్, రాజమహేంద్రవరం, కాకినాడ టౌన్, సామర్లకోట,తుని రైల్వే స్టేషన్లను అమృత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్నారు.



కట్టమూరు ఎత్తిపోతల పథకం

ఎత్తిపోస్తారు!

ప్రైవేటుకు ఎత్తిపోతల

- ఉమ్మడి జిల్లాలో 28 పథకాలు
- కార్పొరేట్‌కు నిర్వహణ బాధ్యత
- రూ.600 కోట్లతో ప్రతిపాదన
- వైసీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం
- ఏజెన్సీలో 50 పథకాల మూత
- కూటమి ప్రభుత్వం దృష్టి
- కొత్త పద్ధతికి శ్రీకారం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

నిర్వీర్యమైన చిన్న నీటిపారుదల వ్యవస్థను బతికించడానికి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ఆరంభించింది. ఓ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థకు మరమ్మతులు, నిర్వహణ బాధ్యత అప్పగించనుంది. ఉభయగోదావరి జిల్లాల్లో మెట్ట ప్రాంతంలోని 48 ఎత్తిపోతల పథకాల మరమ్మతులు, నిర్వహణకు రూ.600 కోట్లతో అధికారులు అంచనాలు సిద్ధంచేశారు. గత వైసీపీ హయాంలో చిన్న నీటిపారుదల వ్యవస్థ పూర్తిగా అవస్థలకు గురైంది. ఇప్పటికే ఏజెన్సీలో 70 ఎత్తిపోతల పథకాలు మూతపడ్డాయి. దీంతో వాటిని వదిలేశారు. కాలువల ద్వారా నీటి సరఫరా లేని మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో సాగునీరు సరఫరా చేయడానికి 1974లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల సంస్థ ఏర్పడింది. కనీసం 50 నుంచి 5 వేల ఎకరాల వరకూ ఉన్న భూములకు ప్రభుత్వం ఒక్కొక్క ఎత్తిపోతల పథకం నిర్మించి రైతులకు అప్పగించేది. వాటికి ఉచిత కరెంట్ ఇచ్చేది. వాటి నిర్వహణ రైతులు చేసుకోవాలి. దీని కోసం 11 మంది సభ్యులతో కూడిన రైతు కమిటీ ఉండేది. రైతుల నుంచి ఎకరాకు రూ.500 నుంచి రూ.1000 వరకూ ఏడాదికి వసూలు చేసి ఎత్తిపోతల పథకాలు నిర్వహణ చూసేవారు. ఇలా చాలా కాలం నడిచిన పథకాలను వైసీపీ పూర్తిగా నిర్వీర్యం చేసింది. దీంతో చాలాచోట్ల రైతులు వదిలేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 101 ఎత్తిపోతల పథకాలు ఉండేవి. 37,450 ఎకరాల ఆయకట్టు ఉండేది. పోలవరం ప్రాజెక్టు ముంపు కారణంగా ఏజెన్సీ ప్రాంతాల్లో 50 ఎత్తిపోతల పథకాలను పనిచేయడంలేదు. మరో 20 పథకాలు నిర్వీర్యమయ్యాయి. ప్రస్తుతం ఉభయగోదావరి జిల్లాల పరిధిలో ఉన్న 48 ఎత్తిపోతల పథకాలను రైతుల నుంచి తప్పించి కార్పొరేట్ సంస్థకు ఇచ్చి వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 28 పథకాలు..

- తూర్పుగోదావరి జిల్లాలో 10 పథకాలు పాక్షికంగా పనిచేస్తున్నాయి. కొవ్వూరు నియోజకవర్గంలో కుమారదేవం, బ్రాహ్మణగూడెం, చాగల్లు, వేగేశ్వరపురం, పైడిమెట్ట-1, నిడదవోలు, అనపర్తిలో పి.బి.దేవం-1,2, కాపవరం,సీతానగరం మండలం కాటవరం ఉన్నాయి.23,745 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు,నిర్వహణకు రూ.195 కోట్ల 60 లక్షలతో అంచనాలు పంపించారు.
- అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4 పథకాలున్నాయి. రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో చింతలమోరి, వసంతవాడ ఉన్నాయి. మొత్తం 4,970 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు, నిర్వహణకు రూ.34 కోట్ల 8 లక్షల 37వేలతో అంచనాలు సిద్ధంచేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పల్లిపాలెం-1,2 పథకాలున్నాయి. 927 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు, నిర్వహణకు రూ.3.48 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు.
- కాకినాడ జిల్లాలో 14 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. పెద్దాపురం నియోజకవర్గంలోని వేట్లపాలెం, కట్టమూరు, కట్టమూరుమినీ, పెద్దాపురం-1,2, జి.మేడపాడు, పెదబ్రహ్మదేవం-3, కాకినాడ రూరల్‌లో వేములవాడ-2, పెద్దాపురపాడు, గొర్రిపూడి, వేములవాడ- అనపర్తి నియోజకవర్గం పరిధి పెదపూడి, దోమాడ, జగ్గంపేట నియోజకవర్గంలో సోమవరం పథకాలున్నాయి. 13,710 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు, నిర్వహణకు రూ.122కోట్ల 25లక్షల 32వేలు అంచనా వేశారు.



కట్టమూరు ఎత్తిపోతల పథకం

నిడదవోలు ఏఎంసీ చైర్మన్‌గా జిన్నా బాబు | తగ్గిన గోదారి 8

బౌద్ధ క్షేత్రంగా పాండవుల కొండ

పరిశీలించిన ఎంపీ పురందేశ్వరి

కోరుకొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బౌద్ధక్షేత్రం పాండవుల కొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు.తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కాపవరంలో ఉన్న పాండవుల కొండను గురువారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, అధికారులతో కలిసి సందర్శించారు. బౌద్ధ వారసత్వ ప్రదేశమైన ఈ పాండవుల కొండ పరిరక్షణ ఎంతో అవసరం అన్నారు. కొండపైన గత రాతి గుహలు, స్థూపాలు, ఆరామాలు జాతీయ ప్రాముఖ్యత కలిగిన కేంద్ర రక్షిత స్మారక చిహ్నంగా ఉందన్నారు. విజయవాడలోని కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఈ కొండను జాతీయ స్మారక చిహ్నంగా ఏనాడో గుర్తించారన్నారు. ప్రస్తుతం ఈ కొండ శిథిలావస్థలో ఉందని దీనికి తక్షణ పరిరక్షణ అవసరం అన్నారు. పాండవుల కొండను బౌద్ధ క్షేత్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఆమె వెంట బీజేపీ నాయకులు ఏపీఆర్ చౌదరి, అడపా సుధీర్‌కుమార్, టీడీపీ నాయకులు కంటే నాగ కేశవరావు, జనసేన నాయకులు తెలగంశెట్టి శివ, బదిరెడ్డి దొర, కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పాండవుల కొండ వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల, బీవీఆర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

గంజాయి కేసుల్లో వేగం పెంచండి : ఎస్పీ

రాజమహేంద్రవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశించారు. గంజాయి కేసులపై గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న నిందితులను అరెస్టు చేయాలని, న్యాయశాఖ సహాయం తీసుకొని చార్జిషీట్లను త్వరితగతిన దాఖలు చేయాలని ఆదేశించారు. ఎన్‌బీడబ్ల్యుల అమలుకు ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. కోర్టు విచారణలో ఉన్న కేసుల్లో సాక్షులు, నిందితులు క్రమం తప్పకుండా హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి కట్టడి దిశగా నిఘా ముమ్మరం చేయాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, రద్దీ ప్రదేశాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ(అడ్మిన్), అర్జున్(క్రైమ్స్) తదితరులు పాల్గొన్నారు.

సూర్యారావు కుటుంబానికి జవహర్ పరామర్శ


సూర్యారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్

దేవరపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, ప్రముఖ పారిశ్రామిక వేత్త కరుటూరి ధనుంజయుడు తండ్రి, మాజీ సర్పంచ్ కరుటూరి సూర్యారావు ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ గురువారం దుద్దు కూరు వెళ్లి సూర్యారావు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సూర్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈయన తోపాటు టీడీపీ నాయకులు ముళ్లపూడి దొరాజీ చౌదరి, ముళ్లపూడి సత్యనారాయణ, ఆచంట శేషారావు, కొయ్యలమూడి తాతారావు , తదితరులు ఉన్నారు.

'స్వచ్ఛంద సంస్థల కృషి అభినందనీయం'


గొల్లగూడెంలో బియ్యం బస్తాలు అందజేస్తున్న అజిత్‌కుమార్

దేవరపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అనాథలు, దివ్యాంగులు, వృద్ధులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని గోపాలపురం మాజీ ఏఎంసీ చైర్మన్ గడా మురళీ అజిత్ కుమార్ పేర్కొన్నారు. గొల్లగూడెంలో లగడపాటి రామ లక్ష్మమ్మ, రామానాయుడు వృద్ధులు, దివ్యాంగుల ఆశ్రమంలో గురువారం చిన్నాయిగూడెంకి చెందిన గడా మురళీ అజిత్ కుమార్ మనవడు గడా అజిత్ నంద మొదటి పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమానికి రూ. 50 వేలు విలువ గల వాషింగ్ మిషన్, పదిబస్తాల బియ్యాన్ని ఆశ్రమ నిర్వాహకుడు కాగిత భాస్కరరావుకు అందజేశారు. కార్యక్రమంలో అజిత్‌నందా తల్లిదండ్రులు గడా శ్రీవాత్సవ్, వాగ్దేవి, తణుకు మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి సుబ్బారావు, వట్టికూటి వెంకటేశ్వరరావు, జొన్నలగడ్డ రామారావు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మవారికి సారె సమర్పణ

చాగల్లు, జులై 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాగల్లులోని కనకదుర్గమ్మ వారికి గురువారం ఆషాఢం సారె సమర్పించారు. దీనిలో భాగంగా మహిళలు సారె కావిడతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ దేవత పాటెమ్మవారు, మహాలక్ష్మి అమ్మవారు సహా పలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోనేరు వీధిలోని కనకదుర్గమ్మ వారికి సారె సమర్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు.


చాగల్లులో ఆషాఢం సారె కావిడతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

తాడిపర్రు ఆలయంలో సంప్రోక్షణ


తాడిపర్రులో హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రులో ఇటీవల నూతనంగా నిర్మించిన పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో గురువారం సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొని ఆలయ ప్రాంగణంలో హోమాలు నిర్వహించారు. తొమ్మిది రకాల ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

దేవరపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం, ధూమంతనగూడెం, సుబ్బరాయపురం గ్రామాల్లోని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జారితే అంతే ..!

● బురదమయంగా చంద్రవరం - వాడపల్లి రోడ్డు ● పట్టించుకోని అధికారులు

చాగల్లు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రవరం నుంచి వాడపల్లి వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణిం చాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా బూసి కాలువ వంతెన దగ్గర పరిస్థితి మరీ దారుణంగా తయారయ్యింది. పలు చోట్ల గుం తలు చెరువును తలపిస్తున్నాయి. ముఖ్యంగా రాజమండి వెళ్లేవారికి ఈ రోడ్డే ప్రధాన ఆధారం. అందువల్ల తక్షణమే మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అధిక లోడుతో ఇసుక లారీలు తిరగడం వల్లే రోడ్డు పూర్తిగా నాశనమైపోయిందని వాహనదారులు, తదితరులు చెబుతున్నారు.

చంద్రవరం నుంచి వాడపల్లి వెళ్లే రోడ్డు దుస్థితి



రోగులకు అసౌకర్యం రానీయొద్దు : ఎమ్మెల్యే

కొవ్వూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): వైద్యం కొసం వచ్చే రోగులకు ఎటువంటి అసౌకర్యం రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ, ద్విసభ్య కమిటీ సభ్యులతో కలిసి ఆసుపత్రిని పరిశీలించారు. వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాలు, ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందని ఆదేశించారు. ఆసుపత్రి శ్లాబ్‌లు లీక్ అవుతున్నాయని, ఎలక్ట్రికల్ సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తే.. తాను ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిణి డాక్టర్ ఎం. పద్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాజేంద్రప్రసాద్, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ముప్పిడి

● గండిపోచమ్మ ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం

కుమారదేవంలో వేంచేసియున్న గండి పోచమ్మ వారి ఆలయ ధర్మకర్తల మండలి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. ఇందులో నూతన అధ్యక్షు డిగా సుంకవల్లి వెంకటేశ్వరరావు సభ్యులుగా కోడూరి సతీష్, మద్దాల వరలక్ష్మి, మిద్దే వెంకటరమణ, తాడిమళ్ల వీవీ సత్యనారాయణ, మట్టా పద్మ, బల్లపాటి రామలక్ష్మి, నూకపెయ్యి జ్యోతి, కవిడి వినన్నతో దేవదాయశాఖ తాడేపల్లిగూడెం ఇన్‌స్పెక్టర్ బి.నరసింహరావు, కార్యనిర్వాహక అధికారి సీహెచ్‌వీ లక్ష్మి ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. అలాగే ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, టీడీపీ మండల అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, నీటిసంఘం అధ్యక్షుడు గొరిజాల సురేష్, తదితరులు నూతన కమిటీని అభినందించారు.

దొమ్మేరులో వ్యాధులపై 3.0 సర్వే

కొవ్వూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): దొమ్మేరులో గురువారం వైద్యాధికారుల బృందం అసంక్రమిత వ్యాధులపై 3.0 సర్వే చేపట్టింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బి.సౌభాగ్య లక్ష్మి ఆదేశాల మేరకు దొమ్మేరు -1 సచివాలయం పరిధిలో కొన్ని గృహాలను గుర్తించి రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యకళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం సిబ్బంది క్వాలిటీ అసెస్‌మెంట్ సర్వే నిర్వహించారు. పీహెచ్‌సీ స్థాయిలో ఎన్‌సీడీ 3.0 సర్వే నాణ్యత అంచనా వేయుటకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళి ఆధారంగా అసంక్రమిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి కౌన్సిలింగ్ అందించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అధిపతి డా.వి.శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని ఐదు గ్రామాలలో క్వాలిటీ అసెస్మెంట్ సర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్‌లు డా. వీవీ దుర్గాప్రసాద్, డాక్టర్ కేవీ ఫణి మాధవి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ వి.సూర్యారావు, డాక్టర్ ఆర్.సురేంద్రబాబు, డా.దీప్తి, సీనియర్ రెసిడెంట్స్ ట్యూటర్లు శాస్త్రి, మూర్తి, ప్రసన్న, డిప్యూటీ డీఎంహెచ్‌వో జే.సంధ్య, లెక్చరర్ ఇన్ సోషల్ సైన్స్ ఆర్.శ్రీనివాస్, దొమ్మేరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.సాంబశివరావు, టీవీ లక్ష్మి, సచివాలయం, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


సర్వేలో పాల్గొన్న వైద్యాధికారుల బృందం

బీసీ హాస్టల్ విద్యార్థులకు పరుపుల పంపిణీ


విద్యార్థులకు అందిస్తున్న దృశ్యం

నిడదవోలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు రోటరీ క్లబ్, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరుపులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ చేసే సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు మీసాల ప్రసాద్, దారపురెడ్డి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ మున్సిపల్ కార్మికుల సమ్మె


మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కొవ్వూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మె గురువారంతో రెండో రోజుకు చేరుకుంది. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈ శిబిరాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుందరబాబు, బి.పవన్ సందర్శించారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు రాజాన అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది సంబరాలు చేసుకుంటున్నప్పటికీ, గతంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మెలో ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలకు సంబంధించి జీవోలు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. బి. రవీంద్ర, పి.వాసు, కె.రాజేష్, కె.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఛలో విజయవాడను జయప్రదం చేయండి


నిడదవోలులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

నిడదవోలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన విజయవాడలోని విద్యుత్ సౌధ వద్ద నిర్వహించే కార్యక్రమంలో విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో బీవీవీ సత్యనారాయణ, ఎం.త్రిమూర్తులు, కె.భరత్ , తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి : ఏవో


మోర్తలో వరి పొలం వద్ద రైతులకు తెగుళ్ల గురించి వివరిస్తున్న ఏవో

ఉండ్రాజవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విత్తని శుద్ధి తప్పనిసరిగా చేయాలని మండల వ్యవసాయాధికారి బి. రాజారావు పేర్కొన్నారు. గురువారం మోర్తలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మనిషికి టీకా ఎంత అవసరమో , పంటకు విత్తన శుద్ధి అంతే అవసరమని చెప్పారు. దీనివల్ల విత్తనాల ద్వారా వచ్చే పలురకాల పురుగులు, తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం మండలంలో 90 శాతం వరినాట్లు పూర్తయినట్టు తెలిపారు. అనంతరం వరిచేను వద్ద పురుగుమందులు, వాటి నివారణ గురించి ఏవో వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది దీప్తి, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

బిక్కవోలు, జూలై 17(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలందరూ తీసుకున్న రుణాలతో వివిధ వ్యాపారాలు చేపట్టి వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌ఎల్‌ఎం టీమ్ సభ్యులు నాగరాజు, వినోద్ సూచించారు. ఆరికరేవులలో మూడో రోజైన గురువారం ఎన్‌ఎల్‌ఎం టీమ్ సందర్శించారు. ఈసందర్భంగా వీరు కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరును పరిశీలించారు. ఉపాధి పనులు, హౌసింగ్‌లో గృహనిర్మాణాలు పరిశీలించారు. అనంతరం పంచాయితీలో సమావేశం నిర్వహించారు. ఉపాధి కూలీలను అందుతున్న వేతనాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెరవలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి ఖండవల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారుజామున ఆచంట మండలం వల్లూరుకి చెందిన నార్కిమిల్లి వెంకటేశ్వరరావు (42) అనే వ్యక్తి ట్రాక్టర్ పై పంగిడి నుంచి మెటల్ వేసుకురావడానికి తన గ్రామం నుంచి బయలుదేరాడు. ఈక్రమంలో ఖండవల్లి వద్దకు వచ్చేసరికి రోడ్డుపై అడ్డుగా ఏర్పాటు చేసిన వేగ నియంత్రణ ఐరన్ డ్రమ్ములను గమనించకపోవడంతో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న వెంకటేశ్వరరావు ట్రాక్టర్‌పై నుంచి రోడ్డుపై పడిపోవడంతో ట్రాక్టర్ ట్రాలీ టైరు అతని పై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

బైక్ ఢీ కొని మరొకరు..

నిడదవోలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గోపవరంలోని కనకదుర్గమ్మ గుడి వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. సైకిల్ మీద వెళుతున్న వ్యక్తిని బైక్ ఢీ కొట్టడంతో సైకిలిస్ట్ సంఘటనాస్థలంలోనే మృతిచెందాడు. మృతుడు గోపవరం గ్రామానికి చెందిన కొప్పర్తి మహరాజ్ (47)గా గుర్తించారు. ఈ మేరకు సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేలివెన్నులో రోగులకు వైద్యసేవలు

ఉండ్రాజవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వేలివెన్నులో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 104 డాక్టర్ సృజన ఆధ్వర్యంలో గురువారం వైద్యసేవలు అందించారు. గ్రామంలో వివిధ వ్యాధులకు సంబంధించి బాధపడుతున్న రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహారం, వ్యక్తిగత శుభ్రత, రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ సృజన వివరించారు. అనంతర వారికి ఐరన్, ఇతర మాత్రలు అందజేశారు. స్థానిక నెం.2 పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం లోని పిల్లలకూ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కె. సుభాషిని, భాగ్యలక్ష్మి, ప్రత్యూష, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

భవిత కేంద్రానికి కుర్చీలు, బెంచీలు వితరణ


నల్లజర్లలో అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు నెక్కలపూడి ప్రతాప్

నల్లజర్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అచ్చన్నపాలెంకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నెక్కలపూడి ప్రతాప్ రూ.30 వేలు విలువ చేసే యూ షేప్ బెంచీలు, కుర్చీలను గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు, ప్రత్యేక అవసరాల విద్యార్థులకు తనవంతు సాయం చేసేందుకు కృషిచేస్తున్నట్టు చెప్పారు. విలువైన ఫర్నిచర్ అందించిన ప్రతాప్ మాస్టారును మానవత సంస్థ జిల్లా కన్వీనర్ కండెపు వెంకట సూర్య నారాయణ, ఎంఈవో సత్యనారాయణ, భగవతి ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్ర మంలో హెచ్ఎం కృష్ణకుమారి, రష్మిత, హెచ్ఎం ఎన్. రాజేంద్రప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై పర్యావరణ శాఖ ప్రజాభిప్రాయ సేకరణ

తాళ్లపూడి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంక గ్రామపరిధిలోని లంకభూముల్లో మేటలు వేసిన ఇసుకను డీ సిల్టేషన్‌కు ప్రభుత్వ అనుమతి కోసం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం పర్యావరణ శాఖ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సతీష్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రక్కిలంక కలోని బ్లాక్ - 8లో గల భూముల్లోని 22.750 ఎకరాల్లోని ఇసుక తవ్వకాలకు లంక భూముల్లోని రైతుల అర్జీ మేరకు వారి పొలాల్లోని ఇసుకను తొలగించే అవకాశం ఉందని తెలిపా రు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు ఇసుక రవాణాలో లారీలపై టార్పాలిన్లు కప్పాలని, దానివల్ల పలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని చెప్పారు. కార్యక్రమంలో పర్యావరణ హిత జేవీ రామారావు మాట్లాడుతూ రీచ్‌ల నుంచి ఇసుకను తీసుకు వెళ్లే లారీలకు సీరియల్ నెంబర్లు వేయడం వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఎదుర్కొన్నపుడు సీరియల్ నెంబరుతో ఆ లారీలను గుర్తించడం వీలౌతుందన్నారు. మైనింగ్ ఏడీ ఫణిభూషన్ రెడ్డి మాట్లాడుతూ ఈ అవగాహన కార్యక్రమంపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్టయితే 24 గంటల్లోపు రాతపూర్వకంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వో విజయ, రెవెన్యూ శాఖ సిబ్బంది, మైనింగ్ శాఖ సిబ్బంది, పర్యావరణ వేత్త సునందారెడ్డి, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సతీష్

నిడదవోలు ఏఎంసీ ఛైర్మన్‌గా జిన్నాబాబు ఎంపిక

ఉండ్రాజవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా చివటం గ్రామానికి చెందిన గాలింకి జిన్నాబాబు ఎన్నికయ్యారు. ఈయన టీడీపీలో నిబద్ధత, అంకితభావంతో పనిచేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. అలాగే ఈయన చివటం గ్రామ టీడీపీ యూనిట్ ఇన్‌చార్జిగా గత ఐదేళ్ల నుంచి కొనసాగుతున్నారు. జిన్నాబాబు ఎంపిక కావడంపై రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు, టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, పలువురు టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిన్నాబాబు తనకు పదవి రావడానికి కృషి చేసిన ఏపీఎస్ఎస్‌డీసీ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.


గాలింకి జిన్నాబాబు

జంతు సంరక్షణలో హైకోర్టు ఆదేశాలు పాటించాలి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత


సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ జంతువుల సంరక్షణ కోసం తప్పనిసరిగా సొసైటీలను నియమించాలని, షెల్టర్‌లను ఏర్పాటు చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. జంతువులపై హింస నివారణకు సొసైటీల ఏర్పాటు, నియంత్రణ నియమాలు, కార్యాచరణపై గురువారం ఆమె ఉమ్మడి తూర్పుగోదావరిలోని వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కొన్ని చోట్ల సొసైటీలు, షెల్టర్‌లు లేవని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం చొరవ చూపి వాటిని ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన స్థలం, నిధులు కేటాయించాల్సిందిగా కలెక్టర్లకు లేఖ రాస్తామన్నారు. సొసైటీల వివరాలు, వాటి ద్వారా సంరక్షించిన జంతువుల సంఖ్య తదితర సమాచారాన్ని ప్రతి నెలా డీఎల్ఎస్ఏకు అందజేయాలన్నారు. హైకోర్టు తీర్పులో సూచించిన జంతు సంరక్షణ చర్యలను తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తే కోర్టు ధిక్కారణ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని పీడీజే హెచ్చరించారు. జంతువులకు కూడా హక్కులు ఉంటాయన్నారు. వాటిని తరలించే సమయంలో పశుగ్రాసం, నీరు తప్పక అందించాలన్నారు. వాహనాల్లో కనీసం కదిలే అవకాశం కూడా లేకుండా జంతువులను తరలించడం క్రూరత్వం కిందకు వస్తుందన్నారు. ఇలా అక్రమంగా జంతువులను తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు, రవాణా శాఖలను ఆదేశించారు. పట్టణాలు/నగరాల్లో జంతువులను రోడ్లపై వదిలిపెట్టరాదన్నారు. గాయపడిన జంతువుల చికిత్సకు అంబులెన్సులు ఉన్నాయని, ఆ సదుపాయాన్ని నెం.1962కి ఫోన్ చేయడం ద్వారా వినియోగించుకోవచ్చని ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఏసీబీ కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాధారణ స్థాయికి గోదావరి ప్రవాహం

● డెల్టా కాలువలకు 14,800 క్యూసెక్కుల నీరు విడుదల


రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో వరద నీటి ప్రవాహం

ధవళేశ్వరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉధృతంగా ప్రవహించిన గోదావరి కొద్దిరోజులుగా తగ్గుతూ ప్రవహిస్తూ సాధారణస్థా యికి చేరుకుంటోంది. దీంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్లను దించి వేసి నీటి విడుదలను నియంత్రిస్తున్నారు. మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను దించి నీటి విడుదలను నిలిపివేయగా ధవళేశ్వరం, ర్యాలీ ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను 10 మిల్లీమీటర్ల మేర ఎత్తి 36,154 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు ఐదు వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2600 క్యూసెక్కులు పశ్చిమడెల్టాకు 7200 క్యూసెక్కులు చొప్పున 14,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా తగ్గుతున్న నీటి మట్టం గురువారం సాయంత్రానికి 14.50 అడుగులకు చేరుకుంది.